
అందరి చూపూ జనసేన స్థానాల వైపే!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు ప్రజానీకం కూడా వచ్చే ఎన్నికల్లో జనసేన పోటీ చేయనున్న స్థానాల పై ఆసక్తి కనబరుస్తున్నాయి. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జనసేన ఎన్ని స్థానాలు కోరుతుంది, ఏయే స్థానాలు కోరుతుంది అన్న దానిపై అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేకించి బలిజ సామాజికవర్గం అధికంగా వున్న తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ స్థానాలతో పాటు రాజంపేట పార్లమెంటు స్థానంలో ఈ రెండు పార్టీల నిర్ణయం ఎలా వుంటుందన్న విషయమై ఇతరులతో పాటు టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్లో కూడా ఆసక్తి నెలకొంటోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై తీవ్ర స్థాయిలో కసరత్తు సాగిస్తున్న నేపథ్యంలో అన్ని వర్గాల్లో దీనిపై విస్తృత చర్చ నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి సీటు ఎవరికి?

వైసీపీ అధిష్ఠానం అసెంబ్లీ, ఎంపీ స్థానాలపై శరవేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రకటించేస్తున్న సంగతి తెలిసిందే. దానికి సమాంతరంగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా కొద్ది రోజులనుంచీ దీనిపై సమాలోచనలు సాగిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీల నడుమ పొత్తు వున్న కారణంగా రెండు పార్టీల అధినేతల నడుమా స్థానాల సర్దుబాట్ల గురించి స్పష్టత రావాల్సి వుంది. అధినేతలు దానిపై కసరత్తు జరుపుతున్నట్టు సమాచారం. కొద్ది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. అయితే ఆ లోపు దీనిపై జిల్లావ్యాప్తంగా చర్చ ఎక్కువైంది. ముఖ్యంగా జనసేనకు కేటాయించే స్థానాలపై జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధుల్లో బలిజ సామాజికవర్గం బలంగా వున్న సంగతి తెలిసిందే. 2009 ఎన్నికల్లో చిరంజీవి ప్రజారాజ్యం తరపున తిరుపతి నుంచీ పోటీ చేసి గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి పొత్తులో భాగంగా తిరుపతిని జనసేనకు కేటాయిస్తారన్న అంచనాలు పెరిగాయి.అలాగే పవన్ కళ్యాణ్ పోటీ చేయాలన్న డిమాండ్ కూడా జనసేన శ్రేణుల నుంచీ బలంగా వుంది. అయితే పవన్ కళ్యాణ్ పోటీ చేసే అవకాశాలు లేవు గానీ సీటు కోసం మాత్రం ఆ పార్టీ గట్టిగా పట్టుబడుతోందని సమాచారం. సీటు కేటాయించడానికి చంద్రబాబు సుముఖంగానే వున్నారని, కాకపోతే ఆ పార్టీ నుంచీ బలమైన అభ్యర్థి లేకపోవడాన్ని గుర్తు చేస్తున్నారని తెలిసింది. జనసేనకు కేటాయించాలంటే బలమైన అభ్యర్థిని అన్వేషించాలని, లేదంటే టీడీపీ నుంచే అభ్యర్థిని పోటీకి నిలపడం మంచిదని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిసింది. తిరుపతిలో టీడీపీకి ఎంత బలమున్నప్పటికీ, బలిజ సామాజికవర్గ ప్రాబల్యం వున్నప్పటికీ పోటీ చేసే అభ్యర్థి కూడా బలంగానే వుండాలని, అభ్యర్థిని ఆషామాషీగా తీసుకునే ప్రసక్తే లేదని చంద్రబాబు భావిస్తున్నట్టు సమాచారం. దీంతో తిరుపతి సీటు ఏ పార్టీ అభ్యర్థికి దక్కుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది.

రాజంపేట పార్లమెంటు సీటుపైనా పెరిగిన ఆసక్తి

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పుంగనూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, కోడూరు, రాజంపేట, తంబళ్లపల్లి తదితర మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బలిజ సామాజిక వర్గ ఓటర్లు గణనీయంగా వున్నారు. ప్రత్యేకించి పుంగనూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, కోడూరు, రాజంపేటల్లో అత్యధికంగా వున్నారు. ప్రజారాజ్యం పార్టీ తరపున 2009లో కూడా ఇక్కడ డీకే ఆదికేశవులు కుమారుడు శ్రీనివాస్ పోటీ చేశారు. 2019లో టీడీపీ తరపున డీకే ఆదికేశవులు సతీమణి సత్యప్రభ పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజంపేట ఎంపీ సీటును జనసేన గట్టిగా కోరే అవకాశముంది. తిరుపతి, చిత్తూరు అసెంబ్లీ సీట్ల తరహాలోనే ఇక్కడ కూడా జనసేనకు బలమైన అభ్యర్థులు ప్రస్తుతానికి అందుబాటులో లేరనే చెప్పాలి. డీకే ఆదికేశవులు కుటుంబం నుంచీ ఎవరైనా ముందుకొస్తే వైసీపీకి దీటైన పోటీ ఇవ్వడానికి ఆస్కారం వుంటుంది.బలిజ సామాజికవర్గంలో అత్యధికులు ఎలాగూ జనసేనకు మద్దతిస్తారు కాబట్టి రెడ్డి సామాజికవర్గం నుంచీ అభ్యర్థిని బరిలోకి దింపితే పోటీ హోరాహోరీగా వుంటుందని, గెలుపొందే అవకాశాలు కూడా వుంటాయని టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఎన్నికలకు కేవలం రెండు నెలలు మాత్రమే వ్యవధి వున్నందున టీడీపీ, జనసేన పొత్తుకు సంబంధించి ఈ నాలుగు స్థానాలపై రాజకీయ వర్గాల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ ఆసక్తి పెరుగుతోంది.

చిత్తూరుపైనా విస్తృత చర్చ

చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా బలిజ సామాజికవర్గం రాజకీయంగా ప్రాబల్యం కలిగివుంది. ఇక్కడ కూడా టీడీపీ ఆ వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. దీంతో ఈ సీటు కూడా పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఇక్కడ కూడా జనసేనకు బలమైన అభ్యర్థి దొరకడం కష్టంగా వుంది. కాకపోతే డీకే ఆదికేశవులు కుటుంబం నుంచీ ఎవరైనా జనసేనలో చేరి పోటీకి సిద్ధపడితే ఇబ్బంది వుండకపోవచ్చు. డీకే కుటుంబీకులు ముందుకు రాకుంటే జనసేనకు ఇక్కడ సీటు కేటాయించే అవకాశాలు తక్కువ.అయితే చిత్తూరులో ఎన్నికల రాజకీయాలు ఆఖరు నిమిషంలో అనూహ్యంగా మారడం పరిపాటి కావడంతో అక్కడ రానున్న రోజుల్లో ఏమి జరుగుతుందన్నది అంచనా వేయలేని పరిస్థితి నెలకొనివుంది.

మదనపల్లెలో అవకాశాలు అధికం

మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో బలిజలు గణనీయ సంఖ్యలో వున్నారు. రాయలసీమ మొత్తం మీద జనసేనకు బలమైన నాయకత్వం వున్న నియోజకవర్గాల్లో ఇది మొదటిది. సొంత బలం కలిగిన గంగారపు రామ్‌దాస్ చౌదరి ఈసారి టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచీ చురుగ్గా పనిచేస్తున్నారు. బలిజ సామాజికవర్గంతో సన్నిహితంగా మెలగడంతో పాటు సొంత కమ్మ సామాజికవర్గంలోనూ పట్టు కలిగివున్నారు. ఇక్కడ రెండు పార్టీలూ కలసి పనిచేస్తే గెలుపు సునాయాసం కానుంది. అనుకూలతలు అధికంగా వున్నందున ఉమ్మడి జిల్లాలో మదనపల్లె సీటు పొత్తులో జనసేనకే కేటాయిస్తారన్న అంచనాలు, ప్రచారం గత చాలాకాలం నుంచీ వున్నాయి. ఇక్కడ పొత్తు మీద జనసేనకు సీటు ఇస్తారా? ఇస్తే ఉమ్మడి అభ్యర్థిగా ఎవరికి అవకాశం వుంటుంది? ఏ సామాజికవర్గం నుంచీ అభ్యర్థి వుంటారు? అన్న అంశాలపై ఇపుడు తీవ్ర చర్చ నడుస్తోంది.





గూడూరులో రోడ్లను శుభ్రపరుస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది - సూళ్లూరుపేటలో వీధులు చిమ్ముతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

పారిశుధ్యానికి పరిష్కారమేదీ?

- సమ్మెలో మున్సిపల్ కార్మికులు
- తిరుపతిలో ఎటుచూసినా చెత్త కుప్పలే
- గూడూరులోచీపురుపట్టిన సిబ్బంది
- సూళ్లూరుపేటలో పాలకవర్గం స్వీపింగ్

తిరుపతి,జనవరి 3 (ఆంధ్రజ్యోతి): "మీ సమస్యలు కళ్లారా చూశాను. మీరుచేసే ఈ పని ఏ ఒక్కరు చేయలేరు. మీకు ఎంత చేసినా ఎంత ఇచ్చినా తక్కువే'.... పారిశుధ్య కార్మికులనుద్దేశించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ చేసిన వ్యాఖ్యలు ఇవి. 'కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని టీడీపీ భ్రమ కల్పించింది. కానీ చేయలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరినీ పర్మినెంట్ చేస్తాం' అని అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్ష నాయకుడిగా వాగ్దానాలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో వెలుగులు రాలేదు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించమని వారు ఎన్నిసార్లు ప్రాధేయపడినా ప్రయోజనం కనిపించలేదు. ఇక చేసేది లేక సమ్మే శరణ్యమని భావించారు. రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల క్రితం సమ్మెలో ఉంటే, తిరుపతికి వచ్చే యాత్రికులను దృష్టిలో ఉంచుకుని మంగళవారం వరకు విధుల్లో పాల్గొన్నారు. బుధవారం నుంచి పనిముట్లు పక్కన పెట్టి ఆందోళనబాట పట్టారు. వీరికి తోడుగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు పలికారు.

● తిరుపతిలో పరిస్థితి అధ్వానం

పారిశుధ్య కార్మికుల సమ్మెతో తిరుపతిలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. తీవ్రమైన దుర్వాసన వస్తోంది. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని కార్మిక సంఘాలు చెబుతుండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారయ్యేలా ఉంది. దీంతో వ్యాధులు పొంచి వుండే ప్రమాదం లేకపోలేదు.గురువారం సమ్మె విరమించి విధుల్లో పాల్గొనాలని కార్పొరేషన్ డీసీ చంద్రమౌళీశ్వరరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి కార్మిక సంఘ నాయకులను కోరారు. ఒకవేళ విధుల్లోకి రాకపోతే టీటీడీ నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కాగా పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో బుధవారం గూడూరులో మున్సిపల్ ఉద్యోగులు, కమిషనర్ రంగంలోకి దిగారు. రోడ్లను శుభ్రపరిచారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వస్తే బాగుంటుందంటున్నారు.సూళ్లూరుపేటలో మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ నరేంద్రకుమార్ కార్మికులతో చర్చలు జరిపారు.చర్చలు విఫలమవడంతో చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిలందరూ చీపురు పట్టి బజారు వీధులను క్లీన్‌చేశారు.



తిరుపతి వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు

● చాలీచాలని జీతాలతో మేమెట్టా బతకాలి?

ఏ ఒక్క నెల జీతం రాకపోయినా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి వర్ణనాతీతమని, పెరిగిన ధరల కారణంగా జీతం కన్నా రెట్టింపు ముందు నెలలోనే అప్పులు చేయాల్సి వస్తుందని నిరసనలో ఉన్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బాడుగ కట్టలేక, ఇల్లు గడపలేక, తిండీతిప్పలు సరిగా లేక, పనికి వచ్చేందుకు ఛార్జీకి లేక నడిచి రావాల్సి వస్తోందన్నారు. ఆరోగ్యం దెబ్బతిని ఈఎస్ఐ హాస్పిటల్‌లో చూపించుకోలేని పరిస్థితి ఉందన్నారు. చాలీచాలని జీతంతో కనీస వసతులు సమకూర్చుకోలేని స్థితిలో తామున్నామని, సెలవు తప్పనిసరైతే జీతం వదులు కోవాల్సిందేనని మదనపడ్డారు. ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమ్మెను పరిష్కరించాలని యూనియన్ నాయకులు తులసీంద్ర, మురళి, రాధాకృష్ణ, విశ్వనాథం తదితరులు డిమాండు చేశారు.



తిరుపతి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

స్పందించకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

● కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ సిబ్బంది బైఠాయింపు



తిరుపతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్ ఎదుట బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు భారీ సంఖ్యలో బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళీ మాట్లాడుతూ గత 23 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది పట్ల సానుకూలంగా స్పందించి, వారి సమస్యలు పరిష్కరించని పక్షంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్న వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు వంటివి న్యాయమైన కోరికలని ఆయన గుర్తు చేశారు. ఈనెల 5వ తేదీలోపు విధులకు హాజరు కాకుంటే ఉద్యోగాల నుంచీ తొలగిస్తామని సీడీపీవోలు హెచ్చరించడంపై ఆయన మండిపడ్డారు. అంగన్వాడీ కార్యకర్తల తొలగింపు సంగతి ఎలా వున్నా అధికారం నుంచీ వైసీపీ ప్రభుత్వాన్ని తొలగించడం మాత్రం ఖాయమని ఎద్దేవా చేశారు. కాగా జిల్లానలుమూలల నుంచీ 3500 మందికి పైగా అంగన్వాడీ కార్యకర్తలు తరలివచ్చి బైఠాయింపులో పాల్గొన్నారు.శిబిరంలో ఆటాపాటలతో, డిమాండ్లు నెరవేర్చాలన్న నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద ప్రభుత్వం పంపిన నోటీసు ప్రతులను తగులబెట్టారు. పలువురు సీఐటీయూ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు.



తిరుపతి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీ సిబ్బంది

20కి చేరిన కొవిడ్ కేసులు

● జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

తిరుపతి సిటీ, జనవరి 3: తిరుపతి రుయాస్పత్రిలో కొవిడ్ కేసులు 20కి చేరుకున్నాయి.గత గురువారం వైద్యులు నిర్వహించిన ర్యాపిడ్ పరీక్షల్లో 4 కేసులు బయటపడగా... 7 రోజుల్లో ఆ సంఖ్య 20కి చేరింది.రుయాస్పత్రిలో ఏర్పాటుచేసిన కొవిడ్ పరీక్షాకేంద్రంలో బుధవారం నిర్వహించిన ర్యాపిడ్ పరీక్షల్లో 16మందికి పాజిటివ్ వచ్చినట్టు సమాచారం.వీరందరికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు.అయితే ర్యాపిడ్ పరీక్షల్లో కొవిడ్ పాజిటివ్ వచ్చిన వారిని అనుమానితులుగా మాత్రమే గుర్తించాలని అధికారులు చెబుతున్నారు.వీరికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేసిన తరువాత వచ్చే ఫలితాలను బట్టి కొవిడ్ ఉందా లేదా అని నిర్ధారిస్తామంటున్నారు.అయితే అందరూ అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

నేడు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభ

తిరుపతి రూరల్, జనవరి 3: ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభను తిరుపతిలో నేడు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రాస్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమ నాయుడు, ఆత్మానంద నాయుడు తదితరులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల పాటు సేవ చేసిన తమకు సకాలంలో పెన్షన్, అరియర్స్ విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం ఉన్నంత కాలం తమకు సమస్యలు తప్పేలా లేవన్నారు. అనివార్య పరిస్థితుల్లోనే పెన్షనర్ల పార్టీ ఏర్పాటు చేసి తమ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. పెన్షనర్లతో పాటు రాష్ట్రంలోని యువత కూడా నిరుద్యోగ సమస్యతో సతమతమవుతోందన్నారు.పార్టీ ఏర్పాటు ద్వారా పెన్షనర్లతో పాటు ప్రజలను కూడా వారి వారి సమస్యలపై చైతన్యం చేసే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దన గౌడ్, ఉపాధ్యక్షుడు మున్నయ్య, గారపాటి విజడమ్ చౌదరి పాల్గొంటారని చెప్పారు.

స్వర్ణముఖిలో ఇసుక మాఫియా రాజ్యం

చంద్రగిరి, జనవరి3: చంద్రగిరి మండలం నరసింగాపురం పరిసరాల్లో స్వర్ణముఖినదిలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని తెలుగు మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. బుధవారం నరసింగాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసింగాపురం పంచాయతీ పరిధిలో స్వర్ణముఖి నది ఉందని, ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. దీనిపై పలుమార్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా ఫలితంలేకుండా పోయిందన్నారు. ఇసుక మాఫియాను పూర్తి స్థాయిలో అరికట్టగలిగేది టీడీపీనే అన్నారు. టీడీపీ నాయకుడు సక్కూరి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

చంద్రగిరిలో 'గడప గడపకు'

చంద్రగిరి, జనవరి 3: చంద్రగిరి పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైంది. చంద్రగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో పాటు ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, చంద్రగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్‌చైర్మన్ చేగు గోవర్ధన్‌గుప్తా, వైసీపీ నాయకులు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శిరిష, ఎంపీడీవో బాలాజీనాయక్, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



చంద్రగిరి, జనవరి 3: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో ఆరేళ్ళ బాలిక అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు... ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీ చేయడానికి జార్ఖండ్ నుంచి కొంతమంది కార్మికులను పది రోజుల క్రితం ఇటుకల యజమాని మధు రప్పించారు. అయితే మంగళవారం జార్ఖండ్ కార్మికుడు రాజేష్ నాయక్ కుమార్తె సోనికుమారి (6)ఇటుకల బట్టీ వద్ద ఆడుకొంటూ కనిపించకపోయింది. పరిసరాల్లో గాలించినా సోనికుమారి ఆచూకీ కనిపించలేదు. దీంతో బుధవారం బాలిక తండ్రి రాజేష్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవీంద్రనాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంగుడుపల్లెలో రైతు అవగాహన సదస్సు

చంద్రగిరి,జనవరి3: చంద్రగిరి మండలం గంగుడుపలెలో అనంతరాజుపేట ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థులు తిరుపతి చీని, నిమ్మ, పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ ముకుంద లక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి విద్యార్థులతో కలిసి మామిడి, చీని, ఇతర ఉద్యాన పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన పంటల సాగులో రైతులకు ఎదురయ్యే సమస్యలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సర్పంచ్ ధర్మారెడ్డి, ఉద్యానవన అధికారి శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు



లబ్ధిదారుకు పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్, తుడా చైర్మన్

భాకరాపేట, జనవరి 3: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో 'తుడా' చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దారు లోకేశ్వరి, జడ్పీటీసీ స్వరూప పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పాకాల,జనవరి3:అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో ప్రభాకర్, ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ కస్తూరి, నరేష్‌రెడ్డి, పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి పూలే అవార్డుతో సన్మానం

ఎర్రావారిపాలెం, జనవరి 3 : మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతోత్సవాలు జరిగాయి.అనంతరం రెడ్డివారిపల్లె ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఝాన్సీబేబీ, కమలయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత, ఈడిగపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్పలతలను సావిత్రిబాయి పూలే అవార్డుతో సన్మానించారు.ఎంఈవో సతీష్‌బాబు. కేజీబీవీ ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయ సంఘ నాయకులు భాస్కర్, మల్లీశ్వర్, మల్లెల సిద్ధయ్య, సుబ్బరాజ, రమణ పాల్గొన్నారు.



పాకాల, జనవరి 3: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం అంబేడ్కర్ భవనంలో భవన కమిటీ అధ్యక్షుడు జి.ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే దామలచెరువు ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో బాట్టీ చేతులమీదుగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

అతిగా మద్యం తాగి ఒకరి మృతి



పాకాల, జనవరి 3: స్థానిక పార్కు వీధి చార్ట్‌మెన్ లైన్‌లో రజక వృత్తితో జీవిస్తున్న చొక్కలింగం(60) అతిగా మద్యం తాగి మృతిచెందాడు. బజారు వీధిలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి అతిగా మద్యం తాగడంతో రక్తపు వాంతి చేసుకుని మృతి చెందాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.స్థానికంగా శానిటైజర్ విక్రయాలు ఎక్కువయ్యాయని, ధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుమల కాలిబాటలో రక్షణ చర్యలపై
నివేదిక అసంపూర్ణం

- ఫెన్సింగ్ నిర్మాణం, అండర్‌పాస్‌ల
- ఏర్పాటుపై డబ్ల్యూఐఐ స్పష్టత ఇవ్వలేదు
- టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ అధికారులు
- మరోసారి సమావేశమై ఓ నిర్ణయానికి రండి
- తిరుమల కాలినడక భక్తుల రక్షణకు
- దీర్ఘకాలిక చర్యలపై వివరాలు సమర్పించండి
- టీటీడీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి నుంచి తిరుమల వరకు కాలినడక మార్గంలో భక్తుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) అందించిన నివేదిక అసంపూర్ణంగా ఉందని బుధవారం హైకోర్టు పేర్కొంది. వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా నడక మార్గంలో ఎక్కడెక్కడ అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి? భక్తుల రక్షణ కోసం ఎంత మేర ఫెన్సింగ్ నిర్మించాలి? ఎక్కడ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలనే విషయంలో నివేదికలో స్పష్టత లేదని పేర్కొంది. టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ మరోసారి సమావేశమై దీనిపై ఓ నిర్ణయానికి రావాలని స్పష్టం చేసింది. సమావేశం అనంతరం నిర్ణయాలను అమలు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. అంతిమంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత టీటీడీదేనని గుర్తు చేసింది. డబ్ల్యూఐఐ చేసిన ఇతర సిఫార్సులను తూచ తప్పకుండా అమలు చేయాలని టీటీడీకి స్పష్టం చేసింది. భక్తుల రక్షణ విషయంలో తీసుకుంటున్న దీర్ఘకాలిక చర్యలపై వివరాలను సమర్పించాలని టీటీడీని ఆదేశిస్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు తిరుపతి అలిపిరి నుంచి తిరుమల వరకు కాలినడక మార్గంలో ఇరువైపుల ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, అటవీ శాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. అటవీశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది ఖాసిం సాహెబ్ స్పందిస్తూ... వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు డబ్ల్యూఐఐ అందించిన నివేదికను మెమో రూపంలో కోర్టు ముందు ఉంచామన్నారు. నివేదికను టీటీడీకి అందజేశామన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపిస్తూ.. ఐరన్ ఫెన్సింగ్, అండర్‌పాస్‌లు ఏర్పాటు విషయంలో డబ్ల్యూఐఐ సానుకూల నివేదిక ఇచ్చిందన్నారు. టీటీడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. డబ్ల్యూఐఐ నివేదికను అమలు చేసేందుకు ఆరు నెలల సమయం పడుతుందన్నారు. చిరుతదాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి టీటీడీ తరఫున రూ.10 లక్షలు, ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు అందజేశామన్నారు. కాలినడక మార్గంలో భక్తుల రక్షణ కోసం టీటీడీ అనేక తాత్కాలిక చర్యలు తీసుకుందని వివరించారు. ఈ దశలో నివేదికను పరిశీలించిన ధర్మాసనం డబ్ల్యూఐఐ నివేదికను అమలు చేసేందుకు టీటీడీ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించింది. నడకమార్గంలో ఎన్ని అండర్‌పాస్‌లు, ఓవర్ పాస్‌లు నిర్మించాలి, ఎక్కడెక్కడ నిర్మించాలి, ఎంతమేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి అనే విషయంపై ఏమైనా నిర్ణయానికి వచ్చారా? అని ప్రశ్నించింది. టీటీడీ తరఫు న్యాయవాది నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. నడకమార్గంలో భక్తులు, వన్యప్రాణుల రక్షణ కోసం ఏ చర్యలు తీసుకోవాలనే విషయంపై స్పష్టత లేకుండా యాక్షన్ ప్లాన్ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించింది. టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ మరోసారి సమావేశమై ఓ నిర్ణయానికి రావాలని ఆదేశించింది.

ఎన్నికల్లో లబ్ధి కోసం దేవుడినీ వదలడం లేదు

- టీడీపీ ఎమ్మెల్సీల ఆగ్రహం



తిరుమల ఆలయం ముందు ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం అధికార పార్టీ నాయకులు భగవంతుడిని కూడా వదిలిపెట్టడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భక్తులకు దర్శనాల విషయంలో టీటీడీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. కేవలం అధికార పార్టీ వారికే దర్శన సౌకర్యాలను కల్పిస్తూ సామాన్య భక్తులను భగవంతుడికి దూరం చేస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఎంపీలకు రోజుకు 20 మందికి దర్శనం కల్పిస్తూ టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల విషయంలో వివక్ష చూపుతూ ఆరుగురికి మాత్రమే దర్శనం కల్పిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. కొంతమందికి ఇష్టానుసారం ప్రొటోకాల్ దర్శనాలు ఇస్తున్నారన్నారు. గదుల కేటాయింపులోనూ ఇదే వివక్ష కొనసాగుతోందన్నారు. ఇకనైనా టీటీడీ అధికారులు తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ టీటీడీలో జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సిన అవసరముందన్నారు. భగవంతుడి వద్ద రాజకీయాలకు చోటు ఇవ్వకూడదన్నారు.



స్వర్ణముఖి నదిని పూడ్చి పక్కా భవన నిర్మాణం చేపడుతున్న దృశ్యాలు

వేదాంతపురంలో భూ బకాసురులు

స్వర్ణముఖిని పూడ్చి బహుళ అంతస్తుల నిర్మాణం

తిరుపతి రూరల్, జనవరి 3: వేదాంతపురం పంచాయతీలో భూ బకాసురులు పెట్రేగిపోతున్నారు. స్వర్ణముఖి కాలువను పూడ్చివేసి ఏకంగా పక్కా భవనాల నిర్మాణం చేపడుతున్నారు. బాయమ్మ తోట దగ్గర డీకేటీ స్థలంలో లేఅవుట్ వేసి విక్రయాలు చేస్తున్నా రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. వేదాంతపురం పంచాయతీ సర్వే నెంబరు-390లోని భూములు 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయి. అయినా లెక్క చేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేపడితే, రెవిన్యూ అధికారులపాత్ర బయటికొచ్చే అవకాశముంది. వేదాంతపురంలో స్వర్ణముఖి నదిని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతి రూరల్ ఎంపీపీగా యశోద



తిరుపతి రూరల్, జనవరి 3: తిరుపతి రూరల్ ఎంపీపీగా యశోద నియమితుల య్యారు.ఇప్పటివరకూ బాధ్యతలు నిర్వహించిన ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా ఉన్న యశోద బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

భూ రీసర్వే పక్కాగా చేపట్టండి

రామచంద్రాపురం, జనవరి 3: రైతుల సమక్షంలో భూ రీసర్వే పక్కాగా చేపట్టాలని జేసీ శుభంభన్సల్ ఆదేశించారు. కె.కె.వి.పురం సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భూసర్వేలో ఎలాంటి వివాదాలకు చోటులేకుండా చూడాలని కోరారు.అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం రైతు పొలాల్లో చేపడుతున్న ఈక్రాప్ బుకింగ్‌లను పరిశీలించి పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ చిన్నవెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖాధికారి శ్రవంతి, సర్వేయర్ హేమకుమార్ పాల్గొన్నారు.

చెవిరెడ్డి హామీలు ఏమయ్యాయి..?

- గ్రామ సభలో ప్రశ్నించిన టీడీపీ, జనసేన నాయకులు



మంగళం కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

తిరుపతి(రవాణా), జనవరి3: గత ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ప్రశ్నించారు. బుధవారం మంగళం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు కార్యదర్శి రాజేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళం ప్రాంతానికి తెలుగుగంగ నీరు అందిస్తామని చెప్పి ఐదేళ్లు కావస్తున్నప్పటికీ ఇంత వరకు సమస్యను పరిష్కరించలేదన్నారు. పేదలకు జగనన్న కాలనీలో ఇంటి పట్టాలు ఇచ్చారే కానీ ఇప్పటి వరకు స్థలం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మహేశ్వరి, గోపీనాథ్, పెరుగు భాస్కర్‌రెడ్డి, చలపతి, వార్డు మెంబర్ నాగరాజు, బాలాజీ, ప్రసాద్, సురేష్ కుమార్, ధర్మారెడ్డి, వెంకటరమణ, నగేష్, కిరణ్, అన్వర్, జనసేన నాయకులు సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి : పులివర్తి నాని



కార్యక్రమంలో పాల్గొన్న పులివర్తి నాని

తిరుపతి రూరల్, జనవరి 3: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. అవిలాల పంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. అవిలాలలో పేదల ఇళ్ళను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలన్నారు. ఏళ్ళ తరబడి నివాసం ఉంటున్నా, పట్టాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మఠం భూముల్లో కొందరికి పట్టాలు ఇచ్చి, మరికొందరికి మొండి చేయి చూపారని ఆరోపించారు. చాలా చోట్ల డ్రైనేజీ సమస్య ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మళ్ళీ చంద్రబాబుకు ఓటు వేసి సీఎంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

33మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ నేతలతో కలిసి నినాదాలు చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 3: రాష్ట్రంలో 33మంది వైసీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ చెప్పారు. షర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నానన్నారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. షర్మిల ధైర్యశాలి అని, ఆమె పార్టీలోకి వచ్చిన తర్వాత పదవి గురించి ఆలోచిస్తామని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఏపీకి ఇన్‌ఛార్జిగా వేయాలని అధిష్ఠానానికి సూచిస్తానంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని విషయాలు బయటకు చెప్పుకోలేని పరిస్థితి ఉంటుందని, వీటిని ఆటో బయోగ్రఫీలో రాస్తున్నానని, ఇందులో విస్మయం చెందే విషయాలు వెల్లడిస్తానని అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ అవినీతికి చిరునామాగా మారిందని విమర్శించారు. ఎప్పుడూ లేనంతగా టీటీడీలో నిధులు దుర్వినియోగమవు తున్నాయని ఆరోపించారు. పేదల కోసం టీటీడీ నిర్మించిన రెండు పాత సత్రాలను కూలదోసి రూ.600కోట్లతో కొత్త కాంప్లెక్సులు నిర్మించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కమీషన్ కోసం తప్ప మరొకటి కాదన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి మంగళవారమూ స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించామని, వారికి అన్యాయం చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం వైకుంఠ ఏకాదశి నాడు వీఐపీలకు రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ఆందోళనలు కనిపిస్తున్నాయని, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, నాగరాజు, జావిద్, వెంకటేష్, శోభారాణి, కుమార్, పటేల్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 3: బీసీ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలుగునాడు విద్యార్థి సమైక్య, జనసేన విద్యార్థి విభాగాలు డిమాండ్ చేశాయి. ఎంఆర్‌పల్లెలో ఉన్న బీసీ హాస్టల్‌ను టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి విభాగాల నాయకులు బుధవారం సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.హేమంత్‌రాయల్, వెంకటేశ్‌యాదవ్, బాటసారి, కోబాకులక్ష్మణ్, మధు, అభి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాజులకండ్రిగలో భారీ చోరీ



ఇంట్లో చెల్లాచెదురైన వస్తువులు

నాగలాపురం, జనవరి 3: ఇంటి తాళాలు పగులగొట్టి, బంగారం, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన నాగలాపురం మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రాజులకండ్రిగ గ్రామానికి చెందిన రాజేంద్రరాజు కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం చెన్నైకి వెళ్లారు.తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు, బీరువాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో వెంటనే రాజేంద్రరాజు భార్య భారతి, కుమారుడు అనిల్ పోలీసులకు సమాచారం అందించారు. ఇంటిలో 56 సవరాల బంగారం, 7 లక్షల నగదు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. దుండగులు ఇంటిలోనికి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి.ఎస్ఐ ఓబయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



దినకర్ (ఫైల్ ఫోటో)

పుత్తూరు అర్బన్, జనవరి 3: రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. ఎస్ఐ వెంకట మోహన్ కథనం మేరకు...పుత్తూరు పట్టణం ఉత్తరపు కండ్రిగ దళితవాడకు చెందిన సుధాకర్ కుమారుడు దినకర్ (17) ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం నడుచుకుంటూ కళ్యాణపురం వైపు వెళుతుండగా ఆరేటమ్మ ఆలయం క్రాస్ వద్ద వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో దినకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

15వ రోజుకు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె

ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

తిరుపతి(విద్య), జనవరి 3 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. జిల్లాలోని 34మండలాలకు చెందిన ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని నినాదాలు చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. అనంతరం తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి నిరసన తెలిపారు.

ఎర్రావారిపాలెం ఎంపీపీగా రెడ్డెమ్మ

ఎర్రావారిపాలెం,జనవరి3: ఎర్రావారిపాలెం ఎంపీపీగా రెడ్డెమ్మ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రెడ్డెమ్మ చింతగుంట ఎంపీటీసీ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంపీపీగా వున్న శివలక్ష్మి రాజీనామా చేయడంతో కొత్త ఎంపీపీగా రెడ్డెమ్మ చేత ఎంపీడీవో అమర్నాథ స్త్రీ శక్తి భవన్‌లో ప్రమాణం చేయించారు.

ఘనంగా శారదాదేవి జయంతి



పాకాల, జనవరి 3: రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ మందిరంలో బుధవారం శారదాదేవి 171వ జయంతి నిర్వహించారు.ఎస్వీ డబ్ల్యూ డిగ్రీ కాలేజి లెక్చరర్ డాక్టర్ అరుణకుమారి శారదాదేవి జీవితం సందేశం గురించి ప్రసంగించారు.

సర్వే ఉద్యోగ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి రూరల్, జనవరి 3: ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం తిరుపతి శాఖ ప్రచురించిన నూతన క్యాలెండర్‌ను జేసీ శుభంబన్సల్ ఆవిష్కరించారు. అంతకు ముందు సంఘం ప్రతినిధులు జేసీ శుభం బన్సల్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ రఘురామరాజు, జిల్లా అధ్యక్షుడు దళవాయి కరుణకుమార్, కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షుడు యశ్వంత్, చంద్రగిరి డివిజన్ అధ్యక్షులు సురేష్‌బాబు, జాయింట్ సెక్రెటరీ విజయకుమార్, కోశాధికారి జ్యోతిగన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఎర్రావారిపాలెం, జనవరి 3 : మండల విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యా సంఘం క్యాలెండర్‌ను ఎంఈవోలు బాల సుబ్రమణ్యం, సతీష్‌బాబు ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి మల్లీశ్వర్, మండల కార్యదర్శి రమణ, ఉపాధ్యాయులు హనుమంతు, ఈశ్వరయ్య, వెంకటాద్రి,భారతి, వాసు శ్రీను, శంకరయ్య, నవీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.97 కోట్లు

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.97 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 73,712 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,902 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



సుగుణేంద్రతీర్థ - నారాయణస్వామి - జయకృష్ణ

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో ఉడిపి పుత్తెగ మఠాధిపతి సుగుణేంద్రతీర్థస్వామి,పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, హీరో మహేష్‌బాబు సోదరుడు రమేష్‌బాబు కుమారుడు జయకృష్ణ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

సీఎంను కలిసిన ఎస్వీయూ వీసీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 3: ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం సీఎం వైఎస్ జగన్‌ను విజయవాడలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డిని కూడా కలిసి యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మద్యం మత్తులో సంపులోపడి యువకుడి మృతి



తిరుపతి(నేరవిభాగం), జనవరి 3: బతుకుదెరువు కోసం దూర ప్రాంతం నుంచి తిరుపతికి వచ్చాడు. డిసెంబరు 31న రాత్రి స్నేహితులతో కలిసి సంబరాలు జరుపుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటివెళ్తూ మద్యం మత్తులో ఓ సంపులో పడి మృతిచెందాడు. తిరుపతి ఆటోనగర్‌లో జరిగిన ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. అలిపిరి ఎస్ఐ ఇమ్రాన్‌బాషా వివరాల మేరకు.. కాకినాడ జిల్లా పెద్దాపురం వీరరాజుపేటకు చెందిన కొండలరావు రెండో కుమారుడు జవ్వాది సత్యన్నారాయణ (25) మూడేళ్ల క్రితం తిరుపతికి వచ్చాడు. ఆటోనగర్‌లోని ఓ వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డిసెంబరు 31వ తేదీ రాత్రి స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మద్యం తాగాడు. అర్ధరాత్రి తర్వాత ఆటోనగర్‌లోని తన రూమ్‌కు బయలుదేరాడు. అక్కడే నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి చెందిన సంప్‌లో పడిపోయాడు. బుధవారం ఉదయం మృతదేహం నీటిపైకి తేలే వరకు ఎవరూ గుర్తించలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇమ్రాన్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి సోదరుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 3 : జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి హాజరై సంఘం డైరీని ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగులు మృతి చెందినప్పుడు దహన క్రియలకు రూ.5వేలు ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ప్రారంభించారు. సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కైలాసనాథ్, రాష్ట్ర కార్యదర్శి జె.ఎం.ఆర్.నాయుడు, రీజనల్ ప్రెసిడెంట్ ఎ.చంద్రయ్య, కార్యదర్శి శేషాద్రి, సహదేవరాజు, శ్రీనివాసులు, మునిరత్నం, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై ఈవో ఏవీ ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. దీనికోసం భక్తులు 0877-2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఎస్వీ శిల్ప కళాశాలలో దరఖాస్తుల గడువు పెంపు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 3: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సాయంత్రం కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు ఈ నెల 20 తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాది కాల పరిమితి కలిగిన సంప్రదాయ కళంకారి, శిల్పకళలలో ప్రాథమిక అంశాలు కోర్సులను నూతనంగా ప్రవేశపెట్టారు. 10వ తరగతి పైబడి విద్యార్హత కలిగి ఉండాలని, వయోపరిమితి లేదని, ఆసక్తిగల మహిళలు, పురుషులు ఈ నెలాఖరులోపు దరఖాస్తులను శిల్పకళాశాలలో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877-2264637, 9866997290లను సంప్రదించాలని కోరారు.

భూహక్కుల చట్టానికి మధ్యంతర ఉత్తర్వులు శుభపరిణామం

నవీనకుమార్‌రెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 3: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కుల చట్టంపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామమని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూహక్కుల చట్టం రాష్ట్ర ప్రజలకు దినదినగండంగా మారిందన్నారు. దీన్ని రాష్ట్ర ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించిందని, న్యాయవాదులు, ప్రజాసంఘాలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయని అన్నారు.ఆలిండియా లాయర్స్ యూనియన్,కర్నూలు బార్ కౌన్సిల్ వేసిన పిల్స్‌పై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు మధ్యంతర స్టే విధిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో భూ వివాదాల కేసులను స్వీకరించాలని ఆదేశించడం శుభపరిణామమన్నారు.

పట్టాలు ఇచ్చారు... స్థలాలు చూపించండి



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 3: ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసిందని, 2020 నుంచి నేటికీ స్థలాలు చూపలేదని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు బుధవారం డీఆర్వో పెంచలకిషోర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. జగనన్న ఇంటిపట్టా పేరుతో ఆశ చూపి ప్రభుత్వం వారి ఆశలను అడియాసలు చేసిందన్నారు. ఇప్పటికైనా వారికి ఇంటిస్థలాలు చూపించాలన్నారు. స్పందించిన డీఆర్వో పెంచలకిషోర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బుజ్జి, శాఖ కార్యదర్శి నిమ్మనపల్లి మునిరత్నం, సభ్యులు మోదిన్ బాదుల్లా, హమీద్, వాసు పాల్గొన్నారు.

రుయాలో ఆగని ప్రైవేటు అంబులెన్సుల దందా

- మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికారులు



10 గంటల నుంచి ఆస్పత్రి ఆవరణలో ఉన్న మహాప్రస్థానం వాహనం



ఉదయం 11 గంటలకు అత్యవసర విభాగం ముందు ఆగి వున్నప్రైవేటు అంబులెన్సు

తిరుపతి సిటీ, జనవరి 3 : రుయాస్పత్రిలో ప్రైవేటు అంబులెన్సుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం బాధితుల పాలిట శాపంగా మారుతోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు ఇక్కడికి వస్తుంటారు. పొరపాటున ఎవరైనా మృతిచెందితే అంబులెన్స్ కోసం రూ.వేలు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. రుయాస్పత్రిలో మృతదేహాలను తీసుకువెళ్లేందుకు నాలుగు మహాప్రస్థానం వాహనాలున్నా అవి కదలకపోవడం ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులకు కలిసి వస్తోంది. ఇదే విషయమై బుధవారం ప్రైవేటు అంబులెన్స్‌లదే హవా అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అయితే అదేరోజు ఆస్పత్రిలో ఏడుగురు మృతి చెందడంతో ముగ్గురి మృతదేహాలను ప్రైవేటు అంబులెన్సుల్లో తీసుకువెళ్లడం గమనార్హం. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం 10.30 గంటల సమయంలో మృతిచెందాడు. ఆ సమయంలో ఆస్పత్రి ఆవరణలో మహాప్రస్థానం వాహనం అందుబాటులో ఉన్నప్పటికీ సిబ్బంది ఆ విషయాన్ని బాధితులకు చెప్పకుండా ప్రైవేటు అంబులెన్సు వారికి సమాచారం ఇవ్వడంతో 11 గంటలకే అత్యవసర విభాగం ముందు ప్రైవేటు వాహనం వచ్చి వాలిపోయింది. బాధితులు చేసేది లేక ఆ వాహనంలోనే మృతదేహాన్ని తీసుకువెళ్లాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు నిత్యం కొనసాగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చేయి తడపనిదే స్ట్రెచ్చర్ కదలదు

- మృతదేహాన్ని బయటకు తీసుకువస్తే రూ.500
- ఇదీ రుయాలో సిబ్బంది తీరు



బాధితుల నుంచి డబ్బు తీసుకుంటున్న సిబ్బంది

తిరుపతి సిటీ, జనవరి 3 : రుయాలో పలువురు సిబ్బంది దోపిడీనే ధ్యేయంగా పని చేస్తుండడంతో రోగులు కార్పొరేట్‌కు దీటుగా ఇక్కడ నగదు వెచ్చించాల్సి వస్తోంది. బుధవారం ఉదయం అత్యవసర విభాగంలో మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని స్ట్రెచర్‌పై బయటకు తీసుకువచ్చి అంబులెన్సులో ఎక్కించేందుకు ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో బాధితుల నుంచి రూ.500 డిమాండ్ చేసి మరీ వసూలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులను వైద్య పరీక్షలు, వార్డుల వద్దకు తీసుకువెళ్లాలంటే చేయి తడపనిదే కదలరనే విమర్శలు బలంగా ఉన్నాయి. అదే మృతదేహాలను బయటకు తీసుకువచ్చి వాహనాల్లో ఎక్కించాలంటే రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. ముందే వార్డులో బాధితులతో బేరం కుదుర్చుకుని ఆపై మృతదేహాన్ని బయటకు తీసుకువస్తారు. రూ.500లకు పైన ఇస్తే మృతదేహాన్ని శుభ్రంగా గుడ్డలో చుట్టి ఇద్దరు సిబ్బంది నేరుగా వాహనం వద్దకు వచ్చి వాహనంలో ఎక్కిస్తారు. తక్కువ ఇస్తే కేవలం ఒక్కరు మాత్రమే మృతదేహాన్ని తీసుకువచ్చి వాహనం వద్ద నిలిపేస్తారు. ఆపై బాధితులే మృతదేహాన్ని వాహనంలో ఎక్కించుకోవాల్సి ఉంటుంది. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

చదువుతోనే స్త్రీలకు స్వేచ్ఛ

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి - 40 మంది అధ్యాపకులకు పురస్కారాల ప్రదానం



సావిత్రీబాయి పూలే ఉత్తమ అధ్యాపక పురస్కారాలు పొందిన వారు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 3: చదువు ద్వారా స్త్రీలకు స్వేచ్ఛ లభిస్తుందని నమ్మిన దార్శనికురాలు సావిత్రీబాయి పూలే అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆమె జయంతి సందర్భంగా అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం 40 మందికి ఉత్తమ అధ్యాపక పురస్కారాలు ప్రదానం చేశారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్, పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి, ఎస్వీ మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఉమ మధుబాల, డాలర్స్ గ్రూప్ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, తుడా మాజీ కార్యదర్శి జ్యోతి, వర్సిటీ రీసెర్చ్ డీన్ విజయభాస్కరరావు తదితరులు మాట్లాడారు.

మంగళం ట్రెండ్స్ పాఠశాలలో..

తిరుపతి (రవాణా): మంగళం ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సంఘ సంస్కర్త, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ప్రధానోపాధ్యాయులు కేశవులునాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నెమిలేటి కిట్టన్న పిల్లపాళెం మునిరత్నం పాల్గొన్నారు.

టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

తిరుపతి(కొర్లగుంట): టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయిపూలే 192వ జయంతి వేడుకలను పరిపాలన భవనం బీసీ హాల్లో ఘనంగా నిర్వహించారు. చెన్నారెడ్డి కాలనీలో ఉన్న బీసీ హాస్టల్లోని 130 మంది బాలికలకు పుస్తకాలు, పెన్స్, పెన్సిల్స్, స్వీట్స్, బిస్కెట్స్ వితరణ చేశారు.

ఆర్టీసీ కార్గో ఆదాయం రూ.8 కోట్లు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 3: తిరుపతి జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఏపీఎస్ ఆర్టీసీ కార్గో ఆదాయం రూ.8కోట్లు లభించింది. తద్వారా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో తూర్పుగోదావరి, కడప జిల్లాలు కొనసాగుతున్నాయి. తిరుపతి నుంచి హైదరాబాదు, చెన్నై, కర్ణాటక, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కార్గో రవాణా సౌకర్యం కల్పించారు. తక్కువ ఖర్చుతో లగేజీలు త్వరితగతిన చేరవేసే చర్యలు చేపట్టారు. డోర్ డెలివరీని మరింత మెరుగుపరిచేందుకు మాసోత్సవాలు నిర్వహించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించారు. దాంతో డోర్ డెలివరీకి ఊహించని విధంగా స్పందన లభించింది. చిల్లర సమస్యకు చెక్ పెట్టేందుకు డిజిటల్ పేమెంట్స్, టూపే విధానాలు ప్రవేశపెట్టారు. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాలలో కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో, 20 కౌంటర్లు ఏజెంట్ల ద్వారా కార్గో వ్యవస్థ నడుస్తోంది.

ఆర్టీసీలో 41మందికి కారుణ్య నియామకాలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 3: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన 41 మంది ఉద్యోగులకు సంబంధించి కారుణ్య నియామకాలు కల్పించినట్లు ఆర్టీసీ కడప జోన్ ఈడీ చెంగల్‌రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన కుటుంబ సభ్యులకు కార్యాలయ సబార్డినేట్లుగా ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. తిరుపతి జిల్లాలో 27మంది, చిత్తూరు జిల్లాలో ఆరుగురు, అన్నమయ్య జిల్లాలో 8మందిని నియమించినట్లు వివరించారు.

ఓటరు దరఖాస్తుల ఫిర్యాదులపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 3: ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు అందించిన ఓటరు జాబితా అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఈనెల 22న ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. పూతలపట్టు, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు తమ నియోజకవర్గంలో నమోదై ఉన్నాయని, ఈ నకిలీ ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకురాలు సుధారెడ్డి కలెక్టర్‌ను కోరారు. పదేపదే ఫిర్యాదు చేస్తున్నామని, న్యాయం చేయాలని ఆమె కోరారు.

తిరుమల 'కాలిబాట'లో రక్షణ చర్యలపై
నివేదిక అసంపూర్ణం

- ఫెన్సింగ్ నిర్మాణం, అండర్‌పాస్‌ల ఏర్పాటుపై డబ్ల్యూఐఐ స్పష్టత ఇవ్వలేదు
- టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ అధికారులు మరోసారి సమావేశమై ఓ నిర్ణయానికి రండి
- తిరుమల కాలినడక భక్తుల రక్షణకు దీర్ఘకాలిక చర్యలపై వివరాలు సమర్పించండి
- టీటీడీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి నుంచి తిరుమల వరకు కాలినడక మార్గంలో భక్తుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) అందించిన నివేదిక అసంపూర్ణంగా ఉందని బుధవారం హైకోర్టు పేర్కొంది. వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా నడక మార్గంలో ఎక్కడెక్కడ అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి? భక్తుల రక్షణ కోసం ఎంత మేర ఫెన్సింగ్ నిర్మించాలి? ఎక్కడ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలనే విషయంలో నివేదికలో స్పష్టత లేదని పేర్కొంది. టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ మరోసారి సమావేశమై దీనిపై ఓ నిర్ణయానికి రావాలని స్పష్టం చేసింది. సమావేశం అనంతరం నిర్ణయాలను అమలు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. అంతిమంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత టీటీడీదేనని గుర్తు చేసింది. డబ్ల్యూఐఐ చేసిన ఇతర సిఫార్సులను తూచ తప్పకుండా అమలు చేయాలని టీటీడీకి స్పష్టం చేసింది. భక్తుల రక్షణ విషయంలో తీసుకుంటున్న దీర్ఘకాలిక చర్యలపై వివరాలను సమర్పించాలని టీటీడీని ఆదేశిస్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు తిరుపతి అలిపిరి నుంచి తిరుమల వరకు కాలినడక మార్గంలో ఇరువైపుల ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, అటవీ శాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. అటవీశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది ఖాసిం సాహెబ్ స్పందిస్తూ... వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు డబ్ల్యూఐఐ అందించిన నివేదికను మెమో రూపంలో కోర్టు ముందు ఉంచామన్నారు. నివేదికను టీటీడీకి అందజేశామన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపిస్తూ.. ఐరన్ ఫెన్సింగ్, అండర్‌పాస్‌లు ఏర్పాటు విషయంలో డబ్ల్యూఐఐ సానుకూల నివేదిక ఇచ్చిందన్నారు. టీటీడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. డబ్ల్యూఐఐ నివేదికను అమలు చేసేందుకు ఆరు నెలల సమయం పడుతుందన్నారు. చిరుతదాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి టీటీడీ తరఫున రూ.10 లక్షలు, ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు అందజేశామన్నారు. కాలినడక మార్గంలో భక్తుల రక్షణ కోసం టీటీడీ అనేక తాత్కాలిక చర్యలు తీసుకుందని వివరించారు. ఈ దశలో నివేదికను పరిశీలించిన ధర్మాసనం డబ్ల్యూఐఐ నివేదికను అమలు చేసేందుకు టీటీడీ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించింది. నడకమార్గంలో ఎన్ని అండర్‌పాస్‌లు, ఓవర్ పాస్‌లు నిర్మించాలి, ఎక్కడెక్కడ నిర్మించాలి, ఎంతమేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి అనే విషయంపై ఏమైనా నిర్ణయానికి వచ్చారా? అని ప్రశ్నించింది. టీటీడీ తరఫు న్యాయవాది నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. నడకమార్గంలో భక్తులు, వన్యప్రాణుల రక్షణ కోసం ఏ చర్యలు తీసుకోవాలనే విషయంపై స్పష్టత లేకుండా యాక్షన్ ప్లాన్ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించింది. టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ మరోసారి సమావేశమై ఓ నిర్ణయానికి రావాలని ఆదేశించింది.

చెత్త తొలగించిన మున్సిపల్ పాలకవర్గం

వాహనాలను అడ్డుకున్న కార్మికులు



చెత్త తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

సూళ్లూరుపేట, జనవరి 3: పారిశుధ్య కార్మికుల సమ్మెతో మున్సిపాలిటీ చెత్తకుప్పలు పేరుకు పోయాయి. దీంతో మున్సిపాలిటీ అధి కారులు, పాలక వర్గం స్పందించి చెత్త కుప్పలను తొలిగిం చేందుకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి స్పదించి కమిషనర్ నరేంద్రకుమార్‌తో చర్చించి అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగ సైతం 10 రోజులే ఉండడంతో కార్మికులతో చర్చలు జరిపారు. చర్చలు విఫలం చెందడడంతో పాలకవర్గం, అధికారులు నడుంబిగించారు. చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిలందరూ చీపురు పట్టి బజారు వీధులను క్లీన్‌చేశారు. స్థానిక పాండురంగ స్వామి ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు చెత్తను తొలగించారు. ట్రాక్టర్లకు లోడుచేసి పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. అయితే చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లను సీఐటీయూ నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమమంలో సీఐటీయూ నాయకులకు, కౌన్సిలర్ల నడుమ తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకొంది. ట్రాక్టరుకు అడ్డుపడి కార్మికులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినదించారు. చెత్తను తొలగించే వారిని అడ్డుకోవద్దని కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ నచ్చజెప్పడంతో కార్మిక నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

60 రోజుల ప్రణాళిక
అంకితభావంతో కొనసాగించండి

నాయుడుపేట టౌన్, జనవరి 3 : పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఉపాధ్యాయులు 60 రోజుల ప్రణాళికను అంకితభావంతో కొనసాగించాలని డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లోతువాని గుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈ విద్యాసంవత్సరం ముందుగా పరీక్షలు నిర్వహిస్తుండటంతో 60 రోజుల ప్రణాళిక పక్బందీగా కొనసాగాలన్నారు.

అవసరమైన పనులనే గుర్తించాలి

కోట, జనవరి 3 : గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులనే చేపట్టాలని ఉపాధి హామీ పథకం ఏపీవో పూర్ణిమ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో పూర్ణిమ మాట్లాడుతూ గ్రామాల వారీగా పనుల వివరాలను సేకరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సంబంధిత క్షేత్ర సహాయకులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు భాస్కర్, శాంతి, పరుశురామ్, తదితరులు ఉన్నారు.

స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణా తరగతులు

గూడూరు, జనవరి 3: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్రనైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో ఉచితశిక్షణా తరగ తులను నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరాములు బుధవారం తెలిపారు. ఈ స్కిల్‌హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ అపరేటర్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించకున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 9492578238, 8639835953, 9440168907 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

పెళ్లకూరు, జనవరి 2 : అయోధ్య రాముడి అక్షింతలను మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బిరదవాడ మునిచంద్ర మాట్లాడుతూ అక్షితలకు పూజలు చేసి ఈ నెల 22న అయోధ్యలో జరిగే పూజల సందర్భంగా తలపై వేసుకోవాలని సూచించారు. సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, ఉప సర్పంచ్ సుజాత, ప్రవీణ ఉన్నారు.

15వ రోజుకు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె
-ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన



తిరుపతి(విద్య), జనవరి 3 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. జిల్లాలోని 34మండలాలకు చెందిన ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని నినాదాలు చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. అనంతరం తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి నిరసన తెలిపారు.

షార్ 'స్థలాల్లో వెలసిన ఫ్లెక్సీల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరు పేట, జనవరి 3: షార్ స్థలాల్లో వెలసిన ఫ్లెక్సీలను తొలగిం చేందుకు ఎట్టకేలకు షార్ అధికారులకు చొరవతీసుకొన్నారు. మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో 'షార్ స్థలాల్లో అధికార పార్టీ ఫ్లెక్సీలు' అనే శీర్షిక వార్త ప్రచురిత కావడంపై షార్ యజమాన్యం స్పందించింది. బుధవారం షార్ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బందితో, సీఐటీఎస్ బలగాలతో వచ్చి హోలీక్రాస్ సర్కిల్ నుంచి షార్ సర్కిల్ సెంటర్ వరకు వెలసిన ఫ్లెక్సీలను తొలిగించారు.

పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, జనవరి 3: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్ధన్ రెడ్డి, రోహిణిల దాతృత్వంతో పేదలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కడివేటి చంద్రశేఖర్, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, దయాకర్, ప్రభాకర్, రాము పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసం దేవుడినీ వదలడం లేదు

టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



తిరుమల ఆలయం ముందు ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం అధికార పార్టీ నాయకులు భగవంతుడిని కూడా వదిలిపెట్టడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భక్తులకు దర్శనాల విషయంలో టీటీడీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. కేవలం అధికార పార్టీ వారికే దర్శన సౌకర్యాలను కల్పిస్తూ సామాన్య భక్తులను భగవంతుడికి దూరం చేస్తున్నారన్నారు.ప్రజాప్రతినిధుల విషయంలోనూ వివక్ష చూపుతున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఎంపీలకు రోజుకు 20 మందికి దర్శనం కల్పిస్తూ టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల విషయంలో వివక్ష చూపుతూ ఆరుగురికి మాత్రమే దర్శనం కల్పిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. వీలైనంతమంది సామాన్య భక్తులకు స్వామి దర్శనం కల్పించాలనేదే టీడీపీ ఆలోచన, ఆకాంక్ష అన్నారు.అవసరమైతే ప్రజాప్రతినిధులకు ఉన్న దర్శనాల సౌలభ్యాన్ని తీసివేసినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అలాకాని పక్షంలో ప్రజా ప్రతినిధులందరికీ ఒకే పద్ధతిని అనుసరించాలన్నారు. కొంతమందికి ఇష్టానుసారం ప్రొటోకాల్ దర్శనాలు ఇస్తున్నారన్నారు. గదుల కేటాయింపు లోనూ ఇదే వివక్ష కొనసాగుతోందన్నారు. ఇకనైనా టీటీడీ అధికారులు తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. 5వ తేదీ నుంచి భారీ బహిరంగ సభలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలబడేందుకు తమ అధినేత చంద్రబాబు జిల్లాల పర్యటనకు రాబోతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా స్వామిని ప్రార్థించానన్నారు. భక్తుల విషయంలో టీటీడీలో జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సిన అవసరముందన్నారు. భగవంతుడి వద్ద రాజకీయాలకు చోటు ఇవ్వకూడదన్నారు.

రాజులకండ్రిగలో భారీ చోరీ



ఇంట్లో చెల్లాచెదురైన వస్తువులు

నాగలాపురం, జనవరి 3: ఇంటి తాళాలు పగులగొట్టి, బంగారం, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన నాగలాపురం మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన రాజేంద్రరాజు కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం చెన్నైకి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు, బీరువాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో వెంటనే రాజేంద్రరాజు భార్య భారతి, కుమారుడు అనిల్ పోలీసులకు సమాచారం అందించారు. ఇంటిలో 56 సవరాల బంగారం, 7 లక్షల నగదు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. దుండగులు ఇంటిలోనికి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి.ఎస్ఐ ఓబయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది.

నేడు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభ

తిరుపతి రూరల్, జనవరి 3: ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభను తిరుపతిలో నేడు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రాస్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమ నాయుడు, ఆత్మానంద నాయుడు తదితరులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల పాటు సేవ చేసిన తమకు సకాలంలో పెన్షన్, అరియర్స్ విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. వయో భారం, అనారోగ్య సమస్యలతో పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం ఉన్నంత కాలం తమకు సమస్యలు తప్పేలా లేవన్నారు. అనివార్య పరిస్థితుల్లోనే పెన్షనర్ల పార్టీ ఏర్పాటు చేసి తమ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. పెన్షనర్లతో పాటు రాష్ట్రంలోని యువత కూడా నిరుద్యోగ సమస్యతో సతమతమవుతోందన్నారు.పార్టీ ఏర్పాటు ద్వారా పెన్షనర్లతో పాటు ప్రజలను కూడా వారి వారి సమస్యలపై చైతన్యం చేసే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దన గౌడ్, ఉపాధ్యక్షుడు మున్నయ్య, గారపాటి విజడమ్ చౌదరి పాల్గొంటారని చెప్పారు.

రైతులను వంచించిన వైసీపీ : నెలవల



మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, జనవరి 3 : రైతాంగాన్ని వైసీపీ ప్రభుత్వం వంచించిందని నాయుడు పేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారేగాని ఆ కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి మేలూ చేకూర లేదని అన్నారు. ఇటీవల సంభవించిన తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో రైతాంగం పూర్తిగా దెబ్బతిందని అయితే ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందలేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలన్నా రైతాంగానికి మేలుచేకూరాలన్నా చంద్రబాబును మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమృత సరళ, టీడీపీ నాయకులు అశోక్‌రెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, కిష్టయ్య, చక్రపాణి, సుంకర కృష్ణయ్య, రాజేంద్ర, పల్లెటి రమణయ్య, సుజాతమ్మ, సుగుణమ్మ, భవానీ, రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సాధికార యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 3: సామాజిక సాధికార యాత్ర జయప్రదం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 లకు ఎన్‌జేఆర్ భవన్ నుంచి క్రాస్‌రోడ్డు, ఎన్‌జేఆర్ సర్కిల్, పాతబస్టాండ్, పాలకేంద్రం మీదుగా డక్కిలి, రాపూరు మద్దెలమడుగు సెంటర్ వరకు బస్సు యాత్ర సాగుతుందన్నారు. అక్కడి నుంచి రాపూరు బస్టాండ్‌కు పాదయాత్రగా వెళ్లి సమీపంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. యాత్రకు 20మంది దాకా ముఖ్యమైన నేతలు విచ్చేస్తున్నారని తెలిపారు.

15వ వార్డులో గడపగడపకూ..

వెంకటగిరిటౌన్, జనవరి 3: వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి బుధవారం స్థానిక 15వ వార్డులో 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ హరి

వెంకటగిరి, జనవరి 3: ప్రమాదం జరిగి ఆగిఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఓ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పొదలకూరు నుంచి పిడకల లోడుతో ఓ లారీ తిరుపతికి బయలుదేరింది. వెంకటగిరి పట్టణం కాంపాళెం సమీపంలోని రాపూరు రోడ్డు మలుపు వద్ద తన లారీని ఓవర్ టేక్ చేసి వెళుతున్న కారును తప్పించబోయి ఎదురుగా ఉన్న కైవల్య నది వంతెన గోడను ఢీకొంది. దీంతో లారీ ముందు టైర్లు పగిలిపోయి అక్కడే ఆగిపోయింది. బుధ వారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అదే సమయంలో నంద్యాల నుంచి చెన్నైకి ఉల్లిపాయలతో వెళుతున్న లారీ తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఆగిఉన్న లారీని వెనుక వైపునుంచి అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో లారీ క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ హరి(45) మృతిచెందాడు. మృతుడిది కడప జిల్లా మైదుకూరు అరుంధతీ వాడగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని పూజారి మృతి



మృతిచెందిన పూజారి

తడ, జనవరి 3: గుర్తు తెలియని వాహనం ఢీకొని పూజారి మృతి చెందాడు. చిట్టమూరు మండలం పంట్రాంగం గ్రామంలోని శివాలయంలో చంద్రశేఖర్ అలియాస్ సుబ్రహ్మణ్యం (68) పూజా రిగా పని చేస్తున్నాడు. బుధవారం పనిమీద కొండూరుకు వచ్చాడు. అక్కడ పనిచూసుకొని తిరిగి వెళ్లే క్రమంలో రోడ్డు దాటు తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లి పోయింది. ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

33మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 3: రాష్ట్రంలో 33మంది వైసీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ చెప్పారు.షర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నానన్నారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారన్నారు. షర్మిల ధైర్యశాలి అని ఆమె పార్టీలోకి వచ్చిన తరువాత పదవి గురించి ఆలోచిస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఏపీకి ఇన్‌చార్జిగా వేయాలని అధిష్టానానికి సూచిస్తానంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని విషయాలు బయటకు చెప్పుకోలేని పరిస్థితి వుంటుందని, వీటిని ఆటో బయోగ్రఫీలో రాస్తున్నానని ఇందులో విస్మయం చెందే విషయాలు వెల్లడిస్తానన్నారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, జనవరి 3: రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే తెలుగు దేశం పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ మండలాధ్యక్షులు గిరిబాబు చెప్పారు. బుధవారం ఆయన మండలంలో 'మీకోసం- మీ తెలుగుదేశం పార్టీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జరగాలంటే రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

జ్యోతిబసు నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి



పుత్తూరు టౌన్, జనవరి 3: పట్టణంలోని టిడ్కో ఇళ్ల నిర్మాణాల పక్కన ఉన్న జ్యోతిబసు నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు కలెక్టర్ వెంకట్రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ జ్యోతి బసు నగర్‌లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. రాత్రిపూట విషసర్పాలు బెడద ఉందని వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో దళిత నాయకులు నందయ్య ఉన్నారు.

పుత్తూరు వార్తలు

పింఛన్ల పంపిణీ



నారాయణవనం, జనవరి 3: మండల కేంద్రంలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తిరువట్యంలో నూతన పించన్లు పంపిణీ చేశారు. జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సదాశివేశ్వరుడి ఆదాయం రూ.5లక్షలు



పుత్తూరు, జనవరి 3 : పుత్తూరు కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు రూ.5లక్షల84వేల ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ రమేష్‌బాబు తెలిపారు. ఈ లెక్కింపులో ఈవో రామ చంద్రారెడ్డి, దేశమ్మ ఆలయ సిబ్బంది పాల్గొన్నారని వివరించారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పుత్తూరు అర్బన్, జనవరి 3: సమస్యలు పరిష్కరించే మున్సిపల్ కార్మికుల సమ్మెను కొనసాగించి తీరుతామని ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు డి. మహేష్ స్పష్టం చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సీఎం జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంకయ్య, యాకోబు, విజయ్‌కుమార్, ప్రభాకర్, గోవిందస్వామి, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ వర్కర్స్ నాయకులు గణేష్, కోమలి, జయంతి, మునెయ్య, ఏఐటీయూసీ నాయకులు రమేష్, సెల్వరాజ్‌ఆచారి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నివాళులు.. పరామర్శలు



ఆదినారాయణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 3: మండల పరిధిలోని రామసముద్రం గ్రామానికి చెందిన ఐ-టీడీపీ కో-ఆర్డినేటర్ మహేష్ తండ్రి ఆదినారాయణ మృతి చెందారు. టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ బుధవారం ఆదినారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అలాగే పట్టణంలోని గేటు వీధికి చెందిన నల్లా ధనభాగ్యం మృతి చెందడంతో నివాళులర్పించారు. మండల పరిధిలోని కైలాసపురానికి చెందిన కొరపాటి సరోజమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, రూరల్ పార్టీ మాజీ అధ్యక్షుడు చెరుకుల కరుణాయాదవ్ తదితరులు ఉన్నారు.

జీవనోపాధి కోసం కోళ్ల పంపిణీ



వడమాలపేట, జనవరి 3: ప్రజలకు జీవనోపాధి కల్పించడం కోసం సబ్సిడీ పై కోళ్ల అందజేసినట్లు వెలుగు ఏపీఎం వి.మునికృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని రామసముద్రంలో వైఎస్సార్ క్రాంతి పథకం కింద 50 యూనిట్లు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో బరువు ఉన్న 11 కోళ్లు యూనిట్‌గా సబ్సిడీ పోను మూడు వేల రూపాయలతో అంద జేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, వైసీపీ నాయకులు నందయ్య, లబ్ధిదారులు, సీసీలు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



పుత్తూరు టౌన్, జనవరి 3: పుత్తూరు మండల విద్యాశాఖ కార్యాలయం నందు ఎస్టీయూ 2024వ సంవత్సరం డైరీ, క్యాలండర్‌ను ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం బుధవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ పుత్తూరు మండల శాఖఅధ్యక్షులు ముని రాములు, ప్రధాన కార్యదర్శి కేశవులు, గౌరవాధ్యక్షులు వై.రవి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఇదేం చోద్యం...?
ముక్కంటి ఆలయ ఆవరణలో కేక్ కటింగ్ !


జన్మదిన సంబరాలు జరుపుకుంటున్న భద్రతా సిబ్బంది

శ్రీకాళహస్తి జనవరి 3: ముక్కంటి ఆలయ ఆవరణలో కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలు జరుపుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఆలయ రెండో గేటు వద్ద సెక్యూరిటీ ఇంచార్జి మణి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఆలయ ఆవరణంలో జరుపుకున్న ఈ సంబరాల ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వెలుగు చూసాయి. ఆధ్యాత్మిక క్షేత్రంలో పాశ్చాత్య పోకడలపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నేడు అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి జనవరి 3:అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలకు నేడు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు భక్త బృందం సభ్యులు తెలిపారు. పట్టణంలోని కొత్తపేట రామ మందిరంలో అక్షింతలకు ఉదయం 9 గంటల నుంచి విశేష పూజలు, రామనామ సంకీర్తన భజన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 3: మండలంలో రెండో విడత జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని ఎంపీడీవో సాయి లహరి కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య డాక్టర్లు, వైద్య సిబ్బందితో ఆరోగ్య సురక్షపై బుధవారం ఆమె సమీక్ష జరిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా

రేణిగుంట,జనవరి 3:రేణిగుంట మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కరకంబాడి,జీపాళెం పంచాయతీల్లో ఉన్న తారక రామానగర్,పద్మానగర్ కాలనీల్లో ఇంటి స్థలాల విషయంలో ఎదు రవుతున్న సమస్యలు పరిష్కరించుకోవడానికి కార్యాలయాల వద్దకు జనం తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.పంచాయతీల్లో మురిక్కాలువలు లేక పోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉందని విమర్శించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.వైఎస్ మణి, మోహన్‌రెడ్డికార్తీక్, రసూల్, అమ్ములు,సూరి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతలు, ఆహ్వానపత్రం, చిత్రపటం పంపిణీ

ఏర్పేడు, జనవరి 3: ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామంలో అయోధ్య శ్రీరామ అక్షింతలు, చిత్రపటం, ఆహ్వానపత్రం పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది.ఎస్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, చెరుకునూరు మునెమ్మ, తులసీరామ్, నాగరాజు, మురళి, చంద్రబాబు, చంద్ర, కుప్పయ్య, జానకీరామ్, ఏకచంద్ర పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ స్కీముల బాండ్ల పంపిణీ

రేణిగుంట,జనవరి 3 :టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ స్కీములు అమలు చేస్తామని టీడీపీ నాయకుడు నాదముని రెడ్డి తెలిపారు. రేణిగుంట మండలం అన్నాసామి పల్లి సమీపంలోని అల్లిమిట్టలో బుధవారం టీడీపీ హామీ ఇస్తున్న భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను ప్రజలకు అందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీని ఓడించాలని కోరారు.

కార్యకర్తలే ప్రాణం

శ్రీకాళహస్తి జనవరి 3: టీడీపీకి కార్యకర్తలే ప్రాణమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం టీడీపీ సోషల్ మీడియా యాప్‌లో చురుగ్గా పని చేసిన సైనికులను ఘనంగా సత్కరించారు.మస్తాన్,మునిరాజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

పిచ్చాటూరు, జనవరి 3: పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకుని పాల ఉత్పత్తి పెంపొందించుకోవాలని పశు వైద్యాధికారి ధనంజయ్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్త గొల్లకండ్రిగలో పశువులకు గాలికుంటి వ్యాధి టీకాలు వేశారు.వెటర్నరీ అసిస్టెంట్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు పట్టాలివ్వండి

కేవీబీపురం, జనవరి 3 : మండలంలోని రాజులకండ్రిగ రెవిన్యూలో ఉన్న సర్వే నెంబర్లు 388, 389, 390, 391, అదే విధంగా 416పీలో ఉన్న భూములపై దళితులకు పట్టాలివ్వాలని బహుజన సమాజ్ పార్టీ అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అర్హత ఉన్నవారిని సెటిల్మెంట్ భూముల జాబితాలో చేర్చాలని తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు.భూములపై కోర్టు తీర్పు వచ్చే వరకు ఏమీ చేయలేమని తహసీల్దార్ చెప్పారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

కేవీబీపురం, జనవరి 3 : మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నాగూరయ్య(65) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు రామాంజుల నాయుడు అధ్వర్యంలో రాయపేడు వెళ్లి నాగూరయ్యకు నివాళులు అర్పించారు.

అందరికీ ఆదర్శం సావిత్రిబాయి పూలే

శ్రీకాళహస్తి జనవరి 3: సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం తేరు వీధిలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం సావిత్రిబాయి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. సిద్దులు గారి ప్రసాద్,కొట్టెసాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం


సావిత్రిబాయి పూలేకి నివాళులు

శ్రీకాళహస్తి, జనవరి 3: సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం పూసల వీధిలోని రామ మందిరం కూడలి వద్ద బుధవారం టీడీపీ బీసీ విభాగం నాయకులు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమేష్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా ఆడవారిని విద్యావంతులుగా మార్చేందుకు ఆమె చేసిన పోరాటం మహోన్నతమన్నారు. టీడీపీ వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బుజ్జి పాల్గొన్నారు. కాగా తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష పట్టణంలోని బాబు అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఏర్పేడు, జనవరి 3: పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధానోపాధ్యాయులు జయకుమార్,జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమరేశ్వరరెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి దురాచారాల నిర్మూలనకు కృషి చేసిందన్నారు.అధ్యాపకురాళ్లు ఉమ, వెంకటసుబ్బమ్మ, సువర్ణ, ఉపాధ్యాయురాళ్లు సునీత, వనజాక్షి, స్వప్నలను సత్కరించారు.తెలుగు పండితుడు చీరాల రెడ్డి, జనార్దన రెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సమీర్, రాఘవరెడ్డి, వెంకటసురేష్, జలగం రామాంజులు, శంకరప్ప, నారాయణరెడ్డి, రాజేంద్రప్రసాద్, గోవిందరాజులు పాల్గొన్నారు.


సీనియర్ అధ్యాపకురాలు ఉమకు సన్మానం

రేణిగుంట: దేశంలో మొదటి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు బుధవారం రేణిగుంటలో ఘనంగా జరిగాయి. అన్నాసామిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీతగౌడ్‌ను సన్మానించారు.సర్పంచ్ ఆర్.నగేషం,జూలియన్ రాజు, అసన్ సాహెబ్,రాజేంద్ర,మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.


రేణిగుంటలో సావిత్రిబాయికి నివాళులు

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి


దినకర్ (ఫైల్ ఫోటో)

పుత్తూరు అర్బన్, జనవరి 3: రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. ఎస్ఐ వెంకట మోహన్ కథనం మేరకు.... పుత్తూరు పట్టణం ఉత్తరపు కండ్రిగ దళిత వాడకు చెందిన సుధాకర్ కుమారుడు దినకర్ (17) ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం నడుచుకుంటూ కళ్యాణపురం వైపు వెళుతుండగా ఆరేటమ్మ ఆలయం క్రాస్ వద్ద వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో దినకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



నాగలాపురం, జనవరి 3: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధూజ పేర్కొన్నారు. నాగలాపురం ఈస్ట్, వెస్ట్, అరుంధతివాడ, కొట్టవాడు, సంజీవినగర్, రాజీవ్‌నగర్, వినోబా నగర్, రామగిరి, కాళంజేరి తదితర గ్రామాల్లో సింధూజ ఆధ్వర్యంలో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదరన్, ప్రేమ, పాండియన్, రవి, శ్రీనివాసన్, గోవిందస్వామి, దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ఆమ్‌ఆద్మీ పార్టీతోనే సాధ్యం

వరదయ్యపాళెం, జనవరి 3: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ నందిని అన్నారు. వరదయ్యపాళెం మండలం కడూరు, కడూరు హరిజనవాడ, వెంకటరెడ్డికండ్రిగ, కంచరపాళెం, వెంగారెడ్డికండ్రిగ, చెన్నావారిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలను పట్టించుకోలేదన్నారు. ఈ సారి ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాలన్నారు.నగేష్, శ్రీనివాసులురెడ్డి,బాలరాజు,సూర్య తదితరులు పాల్గొన్నారు. కగా వరదయ్యపాళెంలో బుధవారం సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పంటలపై రేపు అవగాహన సదస్సు

నాగలాపురం, జనవరి 3:నాగలాపురంలోని టీఆర్ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం పంటలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్పీక్ రీజనల్ ఆఫీసర్ సి.గంగాధరం తెలిపారు.వరి, వేరుశనగ, చెరకు, మామిడి, పూల పంటలపై ఎరువుల వాడకం, మందుల పిచికారి గురించి తెలియజేస్తారన్నారు.

ప్రజాసేవ పార్టీ కార్యాలయం ప్రారంభం

పిచ్చాటూరు, జనవరి 3: పిచ్చాటూరు బైపాస్‌లోని పెట్రోలు బంకు ఆవరణలో బుధవారం ప్రజాసేవ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బాబు పలువురిని ఘనంగా సన్మానించి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీలో చేరిన సమాజ్‌వాది నేత


పురందరేశ్వరికి ముక్కంటి ప్రసాదాలు అందజేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి జనవరి 3: సమాజ్‌వాది పార్టీ నాయకుడు రమణారెడ్డి బీజేపీలో చేరారు.పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనరు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. శ్రీకాళహస్తి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన రమణారెడ్డి 2009లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో షార్టుసర్క్యూట్


కాలిపోయిన ఇంటర్‌నెట్ పరికరాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 3: మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్ అయింది. ఇంటర్‌నెట్‌కు సంబంధించి వివిధ పరికరాలు కాలిపోయాయి. దీంతో నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది.

పెన్షన్ల పంపిణీ



పిచ్చాటూరు/కేవీబీపురం, జనవరి 3: పిచ్చాటూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే ఆదిమూలం పెన్షన్లు పంపిణీ చేశారు.వైసీపీ మండల అధ్యక్షుడు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర నాయుడు,మోహన్, శోభన్‌బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో కూడా పింఛను పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీడీవో రామచంద్ర, నాయకులు కృష్ణయ్య, నందకుమార్, లాల్‌బాబు యాదవ్, దశరథ రామి రెడ్డి, సుబ్బయ్య, వెంకటరత్నం, శ్రీనివాసులు, బాల, హరి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి నిత్యావసరాల వితరణ



నిత్యావసర సరుకులు అందిస్తున్న సూర్యనారాయణరెడ్డి, మునికృష్ణనాయుడు

తిరుపతి(విద్య), జనవరి 3: జీవకోనలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాస్య బాలికల అనాథ శరణాలయానికి తిరుపతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మబ్బుసూర్యనారాయణరెడ్డి సేవాట్రస్ట్ తరఫున బుధవారం రూ.15వేల విలువచేసే నిత్యావసర సరుకులు అందించారు. అధ్యక్షుడు భీమినేని మునికృష్ణనాయుడు మాట్లాడుతూ సేవకు మించిన సంతృప్తి లేదని, క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందని తెలిపారు. సభ్యులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి ముబాకర్‌బాషా, కోశాధికారి వినోద్ వెంకటాచలం, సాకం కృష్ణమూర్తి, రహంతుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉన్నతోద్యోగాలు



మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 3 : విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకుంటే ఉన్నతస్థాయి ఉద్యోగాలను సాధించవచ్చని బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో ప్రథమ సంవత్సర (ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్) విద్యార్థులకు ఏ వర్క్‌షాప్ ఆన్ ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ ఎట్ వర్క్‌ప్లేస్ అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల సదస్సును బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏటా ఎందరో విద్యార్థులు డిగ్రీలు పూర్తిచేసి బయటకు వస్తున్నా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సాధించకుండా సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారని వివరించారు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలని, విద్యాపరంగా కళాశాలలో వనరులను వినియోగించుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. హెచ్‌వోడీలు పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 3 : ఏపీఎన్జీవో అసోసియేషన్ తిరుపతి నగరానికి చెందిన క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు సరేష్‌బాబు, కార్యదర్శి బాలాజీ, హిమగిరి, నారాయణ, ప్రేమలత, పద్మజ పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 3: జీవకోనలో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలను బుధవారం ఎమ్మెల్యే భూమన కరణాకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేలు పెన్షన్‌ను అందిస్తున్నారని తెలిపారు. 14ఏళ్ల పాలనలో చంద్రబాబు ఒరగబెట్టిందేమి లేదని, మళ్లీ అధికారం కోసం పవన్‌కల్యాణ్‌తో కలిసి వస్తున్నారని అన్నారు. అనంతరం రూ.3వేలు పింఛనును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీల ప్రారంభం : నగర పరిధిలోని సంజయ్‌గాంధీ కాలనీలో రూ.46.50లక్షలతో, రెడ్డిగుంట, తిరుమలరెడ్డి నగర్‌లలో రూ.30లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, మురగు కాలువలను, తాతయ్యగుంట వెటర్నరీ ఆస్పత్రి వద్ద రూ.78లక్షలతో నిర్మించిన వార్డు సచివాలయ సముదాయాలను, రవీంద్రనగర్ వద్ద రూ.70లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, డ్రైన్‌లను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

టీడీపీ నేత నరసింహయాదవ్



జయహో బీసీ మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 3: టీడీపీ బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా సముచిత స్థానం కల్పించిందని, తమతోనే వారి అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీసీల ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ సర్కార్ వారిని ఓటర్లుగా పరిగణిస్తూ ఎదుగుదలకు ఏమాత్రం ఉపకరించడంలేదని విమర్శించారు. ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు బనాయిస్తూ బీసీల మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. వెనుకబడిన వారికి పేరుకే పదవులు కట్టబెట్టి పెత్తనమంతా సంపన్నులే చేస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం పూతలపట్టు వైసీపీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వచ్చిన అర్జీలతో బీసీల రక్షణ కోసం టీడీపీ అధికారంలోకి రాగానే ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తున్నారన్నారు. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తుడా నిధులతో శెట్టిపల్లి మార్గంలో బీసీ భవన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తే అధికార పార్టీ నిలుపుదల చేసిందని, టీడీపీ అధికారంలోకి రాగానే పునఃప్రారంభిస్తామని అన్నారు. గురువారం విజయవాడలో జరిగే జయహో బీసీ మహాసభకు పార్టీలకతీతంగా అన్ని వర్గాల బీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ బీసీ జిల్లా అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, బీసీ నాయకులు ఆముదాల తులసీదాస్, జగన్నాథం, పెరుమాల్ మధు, శ్రీరాములు, మధుసూదన్, గోవిందాచారి, మనోహర్ ఆచారి, విశ్వనాథం, అశోక్, మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

పాత మున్సిపల్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నిరసన



దీక్ష చేస్తున్న యూటీఎఫ్ నేతలు - మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 3: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.18వేలకోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు డిమాండ్ చేశారు. తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సంఘ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఎటువంటి బకాయిలు చెల్లించలేదని, దాంతో పలువురు ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారని వాపోయారు. టీచర్లు దాచుకున్న పీఎఫ్ డబ్బులకు రెండుసంవత్సరాలుగా లోన్లు ఇవ్వడం లేదని, ఏపీజీఎల్ఐ బాండ్లు మెచ్యూరిటీ అయినా అతీగతీలేదని, సరెండర్ సెలవుల బకాయిలు విడుదల కాలేదని తెలిపారు. తాము దాచుకున్న డబ్బును తిరిగి పొందలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నామని, ప్రభుత్వం ఈ నిర్లక్ష్య ధోరణిని వీడాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ 11వ పీఆర్సీకి సంబంధించి రూ.7,200కోట్ల బకాయిలు, ఏడు విడతల డీఏలను వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కాగా టీచర్లకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు..ఓపీఎస్ అమలును పెడతామని హామీ ఇచ్చారు. టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు నాగార్జున, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి రెడ్డెప్ప, సీఐటీయూ నాయకులు కందారపు మురళి, సీపీఎం నాయకులు నాగరాజు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. దేవరాల నిర్మల, సూర్యప్రకాశ్, శ్రీదేవి, రమేష్‌నాయుడు, మండి మధుసూదన్‌రెడ్డి, దండు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● టీచర్లతో పెట్టుకుంటే గుణపాఠం నేర్పుతారు

ఉపాధ్యాయులు పాఠాలు బోధించడంతోపాటు దారితప్పిన వారికి గుణపాఠాలు నేర్పుతారని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి పరోక్షంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూటీఎఫ్ చేపట్టిన పోరుబాటకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

ఇళ్లు పగుళ్లుబారుతున్నాయ్.. న్యాయం చేయండి!

జల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన ● దారికి అడ్డంగా కందకం తవ్విన తిమ్మాపురంవాసులు



దారికి అడ్డంగా తవ్విన కందకం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కుప్పం, జనవరి 3: కుప్పం మండలం మిట్టపల్లె పంచాయతీ, తిమ్మాపురం సమీపంలోని జల్లి క్వారీవల్ల ఇబ్బంది పడుతున్న గ్రామీణులు బుధవారం రోడ్డెక్కారు. క్వారీ వాహనాలు తిరిగే దారికి అడ్డంగా కందకం తవ్వి ఆందోళనకు దిగారు. బాధిత గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తిమ్మాపురం సమీపంలో స్థానిక వ్యక్తికి ఉన్న జల్లి క్వారీని తమిళనాడువారికి లీజుకు ఇచ్చారు. ఈ క్వారీతో తమకు నష్టం జరుగుతోందని, ఆస్తిపాస్తులు ధ్వంసమవుతాయని సబ్ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు గ్రామస్తులు చాలాసార్లు ఫిర్యాదు చేశారు. ప్రజల ఆస్తిపాస్తులకు ఏదైనా నష్టం జరిగితే నష్టపరిహారం ఇస్తామని ఫ్యాక్టరీ యజమానులు అప్పట్లో హామీ ఇచ్చారు. అప్పట్నుంచి నడుస్తున్న జల్లి క్వారీతో తిమ్మాపురం గ్రామస్తులకు కష్టనష్టాలు ప్రారంభమయ్యాయి. ఎగిరి పడే కంకర రాళ్లతో ఇళ్ల గోడలు పగుళ్లుబారుతున్నాయి. గాలి కాలుష్యంతో తరచూ చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారు. పశువుల కోసం తెచ్చిన బూసా (పశువుల మేత) దుమ్ము పడి పనికిరాకుండా పోతోంది. దీనిపై క్వారీ యజమానులను పలుమార్లు నిలదీసినా సరైన సమాధానం రాలేదు. చివరకు క్వారీలోని రాళ్లవల్ల ఇంటి గోడలు ధ్వంసమైన రామలింగం, సోముతోపాటు మరికొందరు గ్రామస్తులు, కొంతమంది ప్రజాప్రతినిధులను తీసుకుని బుధవారం ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. తమ ఇళ్లు దెబ్బతిన్నాయని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీంతో తమకు సంబంధం లేదని, ఫ్యాక్టరీ నడుపుకొనేందుకు లైసెన్సు ఉందంటూ వారు సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఫ్యాక్టరీ వాహనాలు రాకపోకలు సాగించే దారి మధ్యలో ఎక్స్‌కవేటర్‌తో పెద్ద కందకం తవ్వి, అక్కడే ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పక్కకు పంపేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కొద్దిపాటి ఉద్రిక్తత తలెత్తింది. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

మున్సిపల్ స్కూల్‌లో మహిళా టీచర్లకు సన్మానం



తిరుపతి(విద్య), జనవరి 3: తీర్థకట్టవీధిలోని మున్సిపల్ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయిఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి టీచర్లతో బీజేపీ నాయకులు కలసి పుష్పాలతో నివాళి అర్పించారు. హెచ్ఎం పుష్పలత, టీచర్ సునీతలను సన్మానించారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దేశంలో తొలి మహిళా టీచర్‌గా ఎందరో మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. నాయకులు పాటిబండ మురళి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, మునికృష్ణయాదవ్, దీపక్‌యాదవ్, కేఎన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్) జనవరి3 : న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 23 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం భావ్యం కాదని, సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని ఆ పార్టీ ఏపీ రాష్ట్ర నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం అనంతవీధి కూడలిలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నారాయణ విద్యార్థికి పురస్కారం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌నాయుడు

తిరుపతి(విద్య), జనవరి 3: కేటీ రోడ్డులోని నారాయణ స్కూల్(టీపీటీ-వీఎన్ఆర్)లో 9వ తరగతి చదివే విద్యార్థి టి.చార్విశ్రీ కూచిపూడి నృత్యంలో అత్యుత్తమ ప్రతిభ చాటి శ్రీకృష్ణ నాట్యమణిబాల పురస్కారాన్ని కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ సుధాకర్‌నాయుడు పేర్కొన్నారు. మహతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతోపాటు బహుమతిని సాధించిందని పేర్కొన్నారు. విద్యార్థిని ఏజీఎం కిశోర్, ఆర్ఐ వసంత్‌కుమార్, టీచర్లు అభినందించారు.

ఘనంగా శారదామాత జయంతి



తిరుపతి (కల్చరల్), జనవరి 03: అనుష్ఠాన వేదాంతానికి ప్రతిరూపం శారదామాత అని స్వామి సుకృతానంద అన్నారు. బుధవారం స్థానిక రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో శారదమాత 171వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సభలో సుకృతానంద మాట్లాడుతూ సాధారణ వ్యక్తిగా జీవితం ప్రారంభించిన శారదామాత అనుష్ఠానయోగం ద్వారా రామకృష్ణుని శిష్యవర్గానికి తల్లిగా మారిందని, ఆమె విశిష్టతను వివరించారు. స్వామి వివేకానందుడు అనేక మార్లు తన సందేహ నివృత్తి కోసం రామకృష్ణుల వారితో వాదించేవారు, కాని శారదామాత మాటకు మాత్రం ఎదురు చెప్పేవాడు కాదని అన్నారు. నిత్యజీవితంలో ఎందరికో శారదామాత అనుగ్రహం ఉందన్నారు. ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల వైద్యులు నిర్మలాదేవి మాట్లాడుతూ తనకు శారదామాత వలన కలిగిన మనోధైర్యం గురించి వివరించారు. అంతకుముందు ఉదయం 5 గంటల నుంచి మంగళహారతి, సుప్రభాతం, వేదపారాయణంతో జయంతి వేడుకలు మొదలయ్యాయి. భజనలు, ప్రత్యేక హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆశ్రమంలో జరిగిన ఆరాత్రికం కార్యక్రమంలో శారదా శతనామావళి పారాయణం, భజనలు జరిగాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ హరి

వెంకటగిరి, జనవరి 3: ప్రమాదం జరిగి ఆగిఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఓ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పొదలకూరు నుంచి పిడకల లోడుతో ఓ లారీ తిరుపతికి బయలుదేరింది. వెంకటగిరి పట్టణం కాంపాళెం సమీపంలోని రాపూరు రోడ్డు మలుపు వద్ద తన లారీని ఓవర్ టేక్ చేసి వెళుతున్న కారును తప్పించబోయి ఎదురుగా ఉన్న కైవల్య నది వంతెన గోడను ఢీకొంది. దీంతో లారీ ముందు టైర్లు పగిలిపోయి అక్కడే ఆగిపోయింది. బుధ వారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అదే సమయంలో నంద్యాల నుంచి చెన్నైకి ఉల్లిపాయలతో వెళుతున్న లారీ తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఆగిఉన్న లారీని వెనుక వైపునుంచి అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో లారీ క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ హరి(45) మృతిచెందాడు. మృతుడిది కడప జిల్లా మైదుకూరు అరుంధతీ వాడగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త తొలగించిన మున్సిపల్ పాలకవర్గం

వాహనాలను అడ్డుకున్న కార్మికులు



చెత్త తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

సూళ్లూరుపేట, జనవరి 3: పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో మున్సిపాలిటీ చెత్తకుప్పలు పేరుకు పోయాయి. దీంతో మున్సిపాలిటీ అధి కారులు, పాలకవర్గం స్పందించి చెత్త కుప్పలను తొలిగిం చేందుకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి స్పదించి కమిషనర్ నరేంద్రకుమార్‌తో చర్చించి అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగ సైతం 10 రోజులే ఉండడంతో కార్మికులతో చర్చలు జరిపారు. చర్చలు విఫలం చెందడడంతో పాలకవర్గం, అధికారులు నడుంబిగించారు. చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిలందరూ చీపురు పట్టి బజారు వీధులను క్లీన్‌చేశారు. స్థానిక పాండురంగ స్వామి ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు చెత్తను తొలగించారు. ట్రాక్టర్లకు లోడుచేసి పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. అయితే చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లను సీఐటీయూ నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమమంలో సీఐటీయూ నాయకులకు, కౌన్సిలర్ల నడుమ తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకొంది. ట్రాక్టరుకు అడ్డుపడి కార్మికులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినదించారు. చెత్తను తొలగించే వారిని అడ్డుకోవద్దని కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ నచ్చజెప్పడంతో కార్మిక నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైజూస్ స్టడీ సెంటర్‌పై ఏఐఎస్ఎఫ్ దాడి

● ప్రభుత్వ ఒప్పందం రద్దు చేసుకోవాలని డిమాండ్ ● స్టడీ సెంటర్‌ను మూసేయాలంటూ ఫర్నిచర్ ధ్వంసం
● విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
● కేసు నమోదు చేయకపోవడంతో స్టేషన్ ముట్టడించేందుకు సిద్ధమైన సీపీఐ



బైజూస్ సెంటర్‌లో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 3: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బైజూస్ స్టడీ సెంటర్‌ను తక్షణం మూసేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.తిరుపతి అన్నారావు కూడలిలోని బైజూస్ స్టడీ సెంటర్‌పై బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు దాడిచేశారు. టీవీలు, కంప్యూటర్లు, ఇతర ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. దీనికిముందు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి, జిల్లా అధ్యక్షుడు ఎ. నవీన్ మాట్లాడుతూ... దివాలా తీసిన విద్యాసంస్థ బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యాపారాన్ని నిర్వహిస్తోందని విమర్శించారు. ట్యాబ్‌ల పేరుతో 3500 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌కు కట్టబెట్టిందన్నారు. ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని తల్లిదండ్రులపై ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ విద్యార్థుల జీవితాలను బైజూస్ నాశనం చేస్తోందన్నారు. ఆన్‌లైన్ క్లాసుల పేరుతో విద్యార్థులకు ట్యాబులిచ్చి ఆ మొత్తాన్ని బజాజ్ ఫైనాన్స్, మరికొన్ని ఫైనాన్స్ సంస్థలద్వారా పెద్దలద్వారా కట్టించుకుని బైజూస్ ఆర్థిక దోపిడీకి పాల్పడుతోందన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బైజూస్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. అనంతరం బైజూస్ స్టడీసెంటర్‌లోకి చొరబడిన విద్యార్థులు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.ఈ విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులు మొత్తం 8 మంది దాడికి పాల్పడినట్టు గుర్తించారు. బండి చలపతి, ఎ. నవీన్, సుందరరావు, హరికృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. రాత్రి వరకు వారిపై కేసులు నమోదు చేయలేదు. బాధితులనుంచి తమకు ఫిర్యాదు అందలేదని అందుకే కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్తూ వచ్చారు. ఇదిలా ఉండగా విద్యార్థి సంఘ నాయకులను రాత్రి అలిపిరి పోలీస్ స్టేషన్ నుంచి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొట్టేందుకే వారిని స్టేషన్ మార్చినట్టు అనుమానించిన సీపీఐ నాయకులు పెద్దసంఖ్యలో ఈస్ట్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. హరికృష్ణను ఈస్ట్‌లోనే ఉంచిన పోలీసులు మిగిలిన ముగ్గురిని తిరిగి అలిపిరి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో సీపీఐ నాయకులు తిరిగి అలిపిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విద్యార్థి సంఘ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమకు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని సీఐ అబ్బన్న చెప్పారు. కేసు నమోదుచేసే వరకు తామ స్టేషన్ వద్దనుంచి కదిలేది లేదని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు.



విదార్థి నాయకులకు మద్దతుగా స్టేషన్ వద్దకు చేరుకున్న సీపీఐ శ్రేణులు

సెబ్ కమిషనర్‌గా పీలేరువాసి

● బాధ్యతలు స్వీకరించిన రవిప్రకాశ్



పీలేరు, జనవరి 3: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కమిషనర్‌గా పీలేరు వాసి ఎం.రవిప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనది పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ బండమీదపల్లె గ్రామం. ఆయన తండ్రి ఎం.రామచంద్రయ్య పోలీసు శాఖలో డీఎస్పీగా పదవీ విరమణ పొంది పీలేరు అయ్యప్పరెడ్డి కాలనీలో స్థిరపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీ, డీఐజీగా సమర్థవంతంగా పనిచేసిన రవిప్రకాశ్‌కు ప్రభుత్వం ఇటీవల ఐజీగా పదోన్నతి కల్పించింది. డీఐజీ హోదాలో సెబ్ డైరెక్టర్‌గా పనిచేస్తుండిన ఆయన పదోన్నతి కారణంగా అదే శాఖకు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయనకు ఇది వరకు ప్రెసిడెంట్ మెడల్, సీఎం గ్యాలంట్రీ అవార్డులు లభించాయి. ఆయన సోదరుడు ఎం.కిరణ్‌కుమార్ ప్రస్తుతం తిరుపతి జిల్లా గూడూరు ఆర్డీవోగా పనిచేస్తున్నారు. రవిప్రకాశ్‌కు ఐజీ, కమిషనర్ పదోన్నతి లభించిన విషయం తెలుసుకున్న స్థానికులు ఆయన తండ్రి రామచంద్రయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాబు బహిరంగ సభ స్థల పరిశీలన

వెంకటగిరి, జనవరి 3: టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 9వ తేదీ వెంకటగిరికి రానున్నారు. తెలుగుదేశం పార్టీ తలపెట్టిన 'రా.. కదలిరా' కార్యక్రమంలో పాల్గొన నున్నారు. వెంకటగిరి - తిరుపతి రోడ్డు మార్గంలో బహిరంగ సభలో ప్రసగించ నున్నారు. ఇందుకోసం బహిరంగ సభా ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ స్థలాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పరిశీలించారు. వారివెంట పార్టీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, సుకుమార్, హేమంత్ చౌదరి, నానీ, చంటి తదితరులు ఉన్నారు.



ఆస్తికోసం దాడి చేస్తున్నారు

● నడిరోడ్డుపై న్యాయంకోసం ఓ మహిళ నిరసన



నడిరోడ్డుపై బైఠాయించిన చంద్రమ్మ - గ్రామపెద్దల దౌర్జన్యం గురించి వివరిస్తున్న చంద్రమ్మ

కుప్పం, జనవరి 3: ఆస్తికోసం గ్రామపెద్దలు కొందరు, తన సోదరుడితో కలిసి తనమీద దాడికి పాల్పడుతున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పం పట్టణంలో నడిరోడ్డుపై బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళ కథనం మేరకు.. కుప్పం మండలం పైపాళ్యంలో నివసిస్తున్న చందమ్మకు భర్త, రెండవ కొడుకు చనిపోయారు. పెద్ద కొడుకు ఉపాధికోసం వలస వెళ్లాడు. దీంతో ఒంటరిదైన చంద్రమ్మ నుంచి ఆమె ఆస్తిపాస్తులు లాక్కోవడానికి సోదరుడు మునిరత్నంతోపాటు కొందరు గ్రామపెద్దలు కలిసి దాడిచేసి బాధిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె బుధవారం నేతాజీరోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. తనకు న్యాయం జరిగేదాకా లేచేదిలేదని భీష్మించింది. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి, ఆమెను బలవంతంగా లేపి, స్టేషన్‌కు తీసుకెళ్లారు.

హైకోర్టు పేరుతో కర్నూలు వాసులకు వంచన

▸▸ రాష్ట్రానికి షర్మిల సేవలు అవసరం: మస్తాన్‌వలి

కర్నూలు(అర్బన్), జనవరి 3: రాయలసీమకు హైకోర్టు పేరుతో కర్నూలు వాసులను మభ్యపెట్టారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మస్తాన్‌వలి జగన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బుధవారం కర్నూలులో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని మోదీ కాళ్ల వద్ద తాకట్టు పెట్టాడన్నారు. రాష్ట్రానికి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ సేవలు అవసరమని ప్రజలు గుర్తించారన్నారు. ఈ పరిస్థితుల్లో షర్మిల సేవలను పార్టీ అవసరమైన చోట వాడుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రజలు, యువత భవిష్యత్ బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ తప్పనిసరిగా అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

వైసీపీ నాశనానికి కారణం జగనే: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తప్పులన్నీ చేసి, ప్రజల్ని మోసం చేసిన సీఎం జగన్.. వైసీపీ సర్వనాశనానికి తానే కారణమని తెలుసుకోకుండా ఇతరులపై రంకెలు వేస్తున్నారని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు విమర్శించారు. జగన్ అహంకారం వల్లే రానున్న ఎన్నికల్లో వైసీపీ దారుణంగా ఓడిపోబోతుందని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామకృష్ణరాజు మీడియాతో మాట్లాడారు. భస్మాసురుడి మాదిరిగా నెత్తిన చేయి పెట్టుకొని, వాళ్లు కుంపటి పెడుతున్నారు... వీళ్లు కుంపటి పెడుతున్నారు అంటే ప్రయోజనం ఏమిటని మండిపడ్డారు.

నేడు కేసీఆర్‌ను పరామర్శించనున్న జగన్

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం జగన్ గురువారం పరామర్శించనున్నారు. ఇటీవల కేసీఆర్‌కు తుంటి ఆపరేషన్ జరిగింది. ఆసుపత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయ్యారు. తాడేపల్లి నివాసం నుంచి ఉదయం పది గంటలకు బయలుదేరి జగన్ హైదరాబాద్‌కు చేరుకుంటారు. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నివాసంలో కేసీఆర్‌ను కలుస్తారు. అనంతరం తాడేపల్లికి జగన్ తిరుగు ప్రయాణమవుతారు.

ఏసీఏలో నిధుల దుర్వినియోగంపై విచారణ

▸▸ ప్రతివాదులకు నోటీసులు.. విచారణ వాయిదా: హైకోర్టు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) పరిపాలన కార్యకలాపాల నిర్వహణకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ)ను నియమించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం కల్చర్ శాఖ ముఖ్యకార్యదర్శి, బీసీసీఐ, ఏసీఏ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గంగయ్య నాయుడు వాదనలు వినిపించారు.

'జోనల్' అమలుపై అఫిడవిట్ వేయండి: హైకోర్టు

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కూడా విద్యా, ఉద్యోగాల భర్తీలో గతంలో ఉన్న జోనల్ నిబంధనలనే పాటిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. 2022 తర్వాత చేపట్టిన ఉద్యోగాల నియామకాల్లో పాత జిల్లాల ప్రాతిపదికన జోనల్ విధానం అమలు చేశామని అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వివరించారు. న్యాయస్థానం స్పందిస్తూ వివరాలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను సంక్రాంతి సెలవుల తర్వాతకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది అంబటి సుధాకరరావు వాదనలు వినిపించారు.

'వ్యూహం'పై సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి: టీ హైకోర్టు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను సస్పెండ్ చేస్తూ ఈ నెల 11 వరకు సినిమా విడుదలను నిలిపేయాలన్న సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులపై నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, రామధూత క్రియేషన్స్.. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఇచ్చింది మధ్యంతర ఉత్తర్వులే అయినందున వాటిపై విచారణ చేపట్టలేమని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత రికార్డును సింగిల్ జడ్జికే సమర్పించాలని సెన్సార్ బోర్డుకు ఆదేశించింది. ఈ నెల 11కు బదులు 8నే మెరిట్స్ ఆధారంగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జికి విజ్ఞప్తి చేసింది.

ఏపీ సెక్రటేరియట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి భూకేటాయింపు సబబే: టీ-హైకోర్టు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఏపీ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి 155ఎకరాల భూకేటాయింపు సబబేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ భూకేటాయింపును సవాల్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగి ఓఎం డెబేరా 2010లో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం కొట్టేసింది.

20, 21 తేదీల్లో చేనేత కార్మిక సంఘం మహాసభలు

మంగళగిరి సిటీ: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఈ నెల 20, 21 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహాసభల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు.

ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ఏపీ వాసుల నిరసన

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీకి చెందిన సామాజిక ఉద్యమకారులు డిమాండ్ చేశారు. పోలవరం నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల చేయాలన్నారు. బుధవారం జంతర్‌మంతర్ వద్ద ఏపీకి చెందిన సామాజిక ఉద్యమకారులు ముక్కాల విజయ రామకృష్ణ, గురువ బాబు, సోముల ఆశోక్‌లు రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని ధర్నా చేశారు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

▸▸ పోరుబాట సభలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

బాపట్ల, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోరుబాట కార్యక్రమాన్ని బాపట్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని సీఎం అసెంబ్లీలో ప్రకటన చేశారని.. ఆర్థికశాఖాధికారులు మాత్రం ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందంటున్నారని వీటిలో ఏది వాస్తవమో తెలిసేందుకు శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 18,096కోట్లు బడ్జెట్‌కు సంబంధించిన సొమ్ముకాదని ఇది ఉద్యోగ, ఉపాధ్యాయుల దాచుకున్న సొమ్ములో నుంచి పెట్టుకున్న లోన్‌లకు సంబంధించిన సొమ్ము మాత్రమేన్నారు. మా డబ్బులు మాకు చెల్లించడానికి ఇన్ని ఆంక్షలు ఎందుకో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మా సొంత డబ్బును వాడుకునే హక్కు మీకెవ్వరిచ్చారని ప్రశ్నించారు. బకాయిలు వెంటనే చెల్లించి, ఒకటో తేదీన వేతనాలివ్వాలని.. లేదంటే 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్జీవీతో వివాదం.. సీఐడీ ఆఫీసుకు కొలికిపూడి

గుంటూరు, జనవరి 3: సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ నమోదైన కేసులో అమరావతి జేఏసీ నేత కొలికిపూడి శ్రీనివాసరావు గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు నుంచి టీడీపీ, జనసేన, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీగా సీఐడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10 నుంచి 5.30 గంటల వరకు విచారణ సాగింది. కొలికిపూడి చేసిన వ్యాఖ్యల కంటే ఆయన వ్యక్తిగత, రాజకీయ అంశాలపైనే ఎక్కువగా సీఐడీ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. తిరిగి ఈ నెల 8న మరోసారి విచారణకు హాజరు కావాలని సీఐడీ అధికారులు చెప్పినట్లు కొలికిపూడి తెలిపారు.



ఎస్టీలపై దాడులు జరుగుతున్నా ఎస్టీ కమిషన్ స్పందించలేదంటూ కమిషన్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న టీడీపీ గిరిజన నేతలు



'అసెంబ్లీ రౌడీ'ని మరిపించేలా..

అప్పుడెప్పుడో అసెంబ్లీ రౌడీ సినిమా వచ్చింది కదా. బాషా టిఫిన్ సెంటర్, బాషా పండ్ల దుకాణం, బాషా సెలూన్ ఇలా ఒక వీధిలో దుకాణాలన్నీ బాషా పేరుతోనే ఉంటాయి. ఆ సినిమాలోని సీన్ ఇప్పుడు ఏపీలోని చాలా ప్రాంతాల్లో వీధి వీధినా కనిపిస్తోంది. పై చిత్రంలోని బోర్డులన్నీ నెల్లూరు నగరంలోని ఒక ప్రాంతంలోనివి. అన్ని దుకాణాలపైనా మా నమ్మకం నువ్వే జగన్ అనే స్లోగన్‌తో సైన్ బోర్డులు దర్శనమిచ్చాయి. దుకాణం పేరు కింద చిన్నగా... పైన 'మా నమ్మకం నువ్వే జగన్' అనే అక్షరాలు పెద్దగా.. సీఎం జగన్ ఫొటో మరింత పెద్దగా ఉండేటా ఈ బోర్డులు డిజైన్ చేశారు. నెల్లూరులోనే కాదు, ఉదయగిరిలోనూ దుకాణాలకు ఇవే బోర్డులు ఏర్పాటు చేశారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ

▸▸ ఆదేశించిన 'హౌసింగ్' ఉన్నతాధికారులు

▸▸ 56 మంది ఏఈల పదోన్నతుల ఫైల్ నిలిపివేత

▸▸ అవినీతి, అక్రమార్కుల గుండెల్లో గుబులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ సంస్థలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. కనీస విద్యార్హతలు లేకపోయినా దొంగ సర్టిఫికెట్లు సమర్పించి హౌసింగ్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు సంపాదించడంతోపాటు అడ్డదారుల్లో ప్రమోషన్లు కూడా పొంది ఉన్నత హోదాలకు ఎదిగిన ఉద్యోగులు వందల్లో ఉన్నారని, అలాంటి వారివల్ల డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులు చేసినవారికి అన్యాయం జరుగుతోందంటూ ఇప్పటికే హౌసింగ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతోపాటు 'హౌసింగ్‌లో నకి'లీలలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమవడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఎక్కువ మంది రెగ్యులర్ స్ట్రీమ్‌లో ఇంజనీరింగ్ చదవకపోయినా, సాంకేతిక నైపుణ్యాలు లేకపోయినా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతుల జాబితాలో చోటు దక్కించుకున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ ప్రమోషన్ల ఫైల్‌ను పక్కనపెట్టేశారు.

లూథియానా నుంచి నకిలీ సర్టిఫికెట్లు!

తగిన విద్యార్హతలు లేకపోయినా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల సిఫారసులతో హౌసింగ్ కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్‌లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర కిందిస్థాయి ఉద్యోగాల్లో చేరినవారిలో ఎక్కువమంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతులు పొందుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. వీరంతా ఉద్యోగాలు చేసుకుంటూనే.. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఐటీఐ, సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సులు పూర్తి చేసినట్లుగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కొంతమంది ఉద్యోగులు హైదరాబాద్, తిరుపతి, ఖమ్మం తదితర ప్రాంతాలలోని విద్యాసంస్థలలో డిప్లొమా కోర్సులు చదివినట్లు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించగా.. ఎక్కువ మంది లూథియానా యూనివర్సిటీలో సాంకేతిక విద్యను అభ్యసించినట్లు దొంగ సర్టిఫికెట్లు సమర్పించినట్లు హౌసింగ్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నిర్ధారణ కోసం అధికార బృందాన్ని లూథియానాకు పంపించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలు.. పదోన్నతులు పొందినవారి గుండెల్లో రైళ్లు పరుగుడెతున్నాయి. నకిలీ సర్టిఫికెట్లు పుట్టించడానికి, వాటి ఆధారంగా పదోన్నతులు, కోరుకున్నచోట పోస్టింగ్ పొందడానికి రూ.లక్షలు ధారపోశామని, ఇప్పుడు అధికారుల విచారణలో నకిలీ సర్టిఫికెట్ల గుట్టు రట్టయితే నిండా మునిగిపోతామని వారంతా ఆందోళన చెందుతున్నట్లు హౌసింగ్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

రూ.లక్షల్లో చెల్లింపులు..

ఇటీవల హౌసింగ్ ఉద్యోగులకు దశలవారీగా పదోన్నతులు కల్పిస్తుండటంతో నకిలీ సర్టిఫికెట్లకు డిమాండ్ ఏర్పడింది. ఓ ముఠా వీరి నుంచి రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఐటీఐ చదివినట్లు సర్టిఫికెట్ కావాలంటే రూ.70 వేలు, సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా సర్టిఫికెట్ కావాలంటే రూ.లక్షకుపైగా చెల్లిస్తే చాలు.. సదరు ఉద్యోగి కాలు కదపకుండానే నకిలీ సర్టిఫికెట్లు తీసుకొచ్చి చేతుల్లో పెడుతున్నట్లు చర్చ నడుస్తోంది. జిల్లాల్లోని హౌసింగ్ అధికారులు కూడా తమకు అనుకూలంగా ఉండే ఉద్యోగులను నకిలీ సర్టిఫికెట్లు తెచ్చుకోమని ప్రోత్సహించడంతోపాటు, వారికి పదోన్నతులు కల్పించి తమ దగ్గరే పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారని చెబుతున్నారు. తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో ఒక వర్క్ ఇన్‌స్పెక్టరుకు నకిలీ సర్టిఫికెట్లపై రెండు మండలాలను అప్పగించినట్లు సమాచారం. నెల్లూరు జిల్లా సర్వేపల్లి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల్లో హౌసింగ్ ఏఈలుగా పనిచేస్తున్న ఐదుగురిని గత నెలలోనే ఇన్‌చార్జి డీఈఈలుగా నియమించి అనధికారిక ప్రమోషన్లు కల్పించినట్లు ఫిర్యాదులున్నాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తంతు నడుస్తోందని, విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకొస్తాయని హౌసింగ్ ఉద్యోగులు చెబుతున్నారు.

అ'పూర్వ' కలయిక



హైదరాబాద్ సమ్మేళనంలో విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి పూర్వ విద్యార్థులు

▸▸ 50 ఏళ్ల తర్వాత స్కూల్ యూనిఫాంతో సందడిచేసిన విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వారంతా 50 ఏళ్ల తర్వాత మళ్లీ స్కూల్ యూనిఫాం వేసుకున్నారు. తాము చదివిన రోజులను గుర్తు చేసుకుని.. చిన్న పిల్లల్లా మారి సందడి చేశారు. విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి స్కూల్ 1962-1974 విద్యార్థులు తాము పాఠశాల విడిచి 50 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇందులో కొందరు విదేశాల్లో స్థిరపడిన వారున్నా.. ఎల్లలు మరచి సమ్మేళనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఐదేళ్లలో 10శాతమైనా పూర్తి కాలేదు!

▸▸ కోర్టు భవనాల నిర్మాణంలో జాప్యం ఎందుకు జరుగుతోంది?

▸▸ కేంద్రం తన వాటాగా 60% నిధులిస్తోంది కదా!

▸▸ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోర్టు భవనాల నిర్మాణ పురోగతిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని భవనాల నిర్మాణ పనులు 2018లో ప్రారంభమైనా, ఇప్పటికి 10శాతం కూడా పూర్తి కాలేదని ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టు భవనాల నిర్మాణ ఖర్చులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా 60శాతం నిధులు ఇస్తోందని గుర్తు చేసింది. అయినప్పటికీ నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇప్పటికీ రాష్ట్రంలోని చాలా కోర్టులు అద్దె భవనాల్లోనే సేవలందిస్తున్నాయని పేర్కొంది. న్యాయవ్యవస్థలో మౌలికవసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో నివేదిక సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని సూచించింది. రాష్ట్రంలోని కోర్టు భవనాల నిర్మాణ పురోగతి, కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు భవన నిర్మాణాల నాణ్యతను పరిశీలించేందుకు నేషనల్ బిల్డింగ్స్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్‌బీసీసీ)వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థ కానీ, మరే ఇతర ఏజెన్సీనైనా గుర్తించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కృష్ణా జిల్లా, గన్నవరంలో నూతన కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు ఇప్పటికే ఉన్న పాత భవనానికి మరమ్మతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దేవిరెడ్డి రాజశేఖరరెడ్డి దాఖలు చేసిన పిల్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ విధంగా స్పందించింది.

జేఈఈ మెయిన్స్‌కు 'బ్రేక్స్'లోనూ తనిఖీలు, బయోమెట్రిక్

▸▸ జనవరి 21 నుంచి పరీక్షలు

న్యూఢిల్లీ, జనవరి 3: ఇంజనీరింగ్ జాతీయ ప్రవేశ పరీక్ష.. జేఈఈ మెయిన్స్ నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారులు తెలిపారు. పరీక్ష ప్రారంభంలో విద్యార్థులను ఆసాంతం తనిఖీ (ఫ్రిస్కింగ్) చేయడం, బయోమెట్రిక్ తీసుకోవడం ఇప్పటివరకూ అమలులో ఉన్న ప్రక్రియ. జనవరి 21 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరిగే మెయిన్స్‌కు కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి తిరిగి వచ్చేటపుడు కూడా ఆసాంతం తనిఖీ చేయడం, బయోమెట్రిక్ తీసుకోవడం తప్పనిసరి చేస్తున్నట్లు ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్స్ మొత్తం 13 భాషల్లో.. ఇంగ్లీషు, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు, ఉర్దూలో నిర్వహిస్తున్నారు. ఫలితాలు ఫిబ్రవరి 12న వెల్లడిస్తారు. ఈ సారి పరీక్షకు రికార్డు స్థాయిలో 12.3 లక్షలు మంది నమోదు చేసుకున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.

ఆ దావాలు సివిల్ కోర్టులు తీసుకోవచ్చు

▸▸ భూయాజమాన్య చట్టంపై హైకోర్టు కీలక ఉత్తర్వులు

▸▸ చట్టం వచ్చిందంటూ స్థిరాస్తి దావాలు తిరస్కరించరాదు

▸▸ పాత దావాల విచారణ.. కొత్తవాటినీ స్వీకరించాల్సిందే

▸▸ సివిల్ కోర్టులకు ఆదేశాలు

▸▸ విచారణ ఫిబ్రవరికి వాయిదా

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భూయాజమాన్య హక్కు చట్టం విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త చట్టం అమల్లోకి వచ్చిందంటూ స్థిరాస్తి వివాదాలపై దాఖలయ్యే వ్యాజ్యాలను సివిల్ కోర్టులు విచారణ నిమిత్తం స్వీకరించకపోవడాన్ని ఆక్షేపించింది. కొత్తగా దాఖలయ్యే వ్యాజ్యాలను విచారణ నిమిత్తం స్వీకరించాల్సిందేనని ఆదేశించింది. చట్టంలోని నియమనిబంధనలు పూర్తిగా అమల్లోకి రాలేదని గుర్తుచేసింది. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాల్లోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీచేయడంతో పాటు నియమనిబంధనలు రూపొందించేందుకు సమయం పడుతుందని ఏజీ చెప్పిన వివరాలను నమోదుచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులోభాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ భూయాజమాన్య హక్కు చట్టాన్ని సవాల్ చేస్తూ ఏపీ బార్ కౌన్సిల్ తరఫున సభ్యులు కె.చిదంబరం, ముప్పాళ్ల సుబ్బారావు, జి.సుదర్శనరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూయాజమాన్య హక్కు చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని అభ్యర్థించారు. అలాగే భూయాజమాన్య హక్కుచట్టం తీసుకొచ్చే శాసనాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని పేర్కొంటూ ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఏపీ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ పిల్ దాఖలు చేశారు.

రాజ్యాంగంలోని పలు అధికరణలను అతిక్రమించేలా ఉన్న భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే భూయాజమాన్య హక్కు చట్టాన్ని సవాల్ చేస్తూ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి పిల్ దాఖలు చేశారు. యాక్ట్‌లోని పలు సెక్షన్లు పౌరుల ఆస్తిహక్కుకు భంగం కలిగించేలా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు గంటా రామారావు, ఎన్.సుబ్బారావు, న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపించారు. యాక్ట్‌తోపాటు అందులోని వివిధ సెక్షన్ల చట్టబద్ధతను సవాల్ చేస్తూ వ్యాజ్యాలు దాఖలు చేశామన్నారు. చట్టంలోని సెక్షన్ 38 ఆధారంగా స్థిరాస్తికి సంబంధించిన దావాలను సివిల్ కోర్టులు తిరస్కరిస్తున్నాయన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. చట్టం తీసుకొచ్చినా అది అమలుకావడం లేదన్నారు. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాలను నోటిఫై చేయాల్సి ఉందన్నారు. టైటిల్ రిజిస్టర్ సిద్ధం చేయాల్సి ఉందని తెలిపారు. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ల్యాండ్ టైటిలింగ్ అప్పీలేట్ అధికారులను నియమించలేదని, నియమ నిబంధనలు రూపొందించలేదని పేర్కొన్నారు. చట్టంలోని సెక్షన్ 38ను అనుసరించి భూవివాదాలను సివిల్ కోర్టుల్లో విచారణ చేయకుండా నిరోధించే నిబంధనపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా వచ్చే స్థిరాస్తి వివాదాలను సివిల్ కోర్టులు విచారణకు స్వీకరించవచ్చు అన్నారు. దానిపై ఎలాంటి నిషేధం లేదన్నారు. స్థిరాస్తికి సంబంధించిన దావాలను తిరస్కరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొత్త దావాలను తిరస్కరించవద్దంటూ సివిల్ కోర్టులను విజ్ఞప్తి చేయాలని ప్రభుత్వ న్యాయవాదులకు సూచన చేస్తామన్నారు. యాక్ట్ పై వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం...చట్టంలోని కొన్ని నిబంధనలు నోటిఫై చేయలేదని, అందుకు సమయం పడుతుందని ప్రభుత్వం చెబుతోందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చే స్థిరాస్తి వివాదాలపై దాఖలయ్యే వ్యాజ్యాలను విచారణ నిమిత్తం స్వీకరించవచ్చని, పాత దావాల పై విచారణను కొనసాగించవచ్చని సివిల్ కోర్టులకు హైకోర్టు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది.

ఎస్ఐ అభ్యర్థులకు సేవా శిక్ష

▸▸ 'ఎత్తు'పై తమను తప్పుదోవ పట్టించిన వారు ఆసుపత్రిలో సేవ చేయాలన్న హైకోర్టు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాలకు సంబంధించి 'ఎత్తు' విషయంలో కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించిన ఎస్ఐ అభ్యర్థులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందించాలంటూ సామాజిక సేవా శిక్షను విధించింది. సేవ చేసిన అనంతరం సంబంధిత ఆసుపత్రి హెచ్‌వోడీ ఇచ్చే సర్టిఫికెట్‌ను రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని అభ్యర్థులను ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ప్రభుత్వ అప్పీల్‌ను అనుమతించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి. నరేందర్, జస్టిస్ ఎన్. విజయ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌కి సంబంధించి నిర్వహించిన ఎత్తు పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు, 2023 నోటిఫికేషన్‌కి సంబంధించి జరిగిన పరీక్షల్లో ఎత్తు తగ్గారని ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ 24 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ సందర్భంగా తామే ఎత్తు కొలుస్తామని ప్రకటించిన అనంతరం ఎత్తు విషయంలో ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లను అభ్యర్థులు కోర్టుకు సమర్పించడాన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. పిటిషనర్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి విధించే శిక్షను సామాజిక సేవగా మారుస్తున్నామని పేర్కొంది.

జగన్ పాలనలో పడకేసిన ప్రాజెక్టులు

▸▸ సీమ ప్రాజెక్టులపై శ్వేతపత్రం ఇవ్వాలి: టీడీపీ

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పడకేశాయని టీడీపీ విమర్శించింది. రాయలసీమ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చూపుతున్న అంతులేని నిర్లక్ష్యం సీమ పాలిట పెనుశాపంగా పరిణమించిందని మండిపడింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు, రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి బుధవారం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులకు సంబంధించి జగన్ పత్రికలో ప్రచురించిందంతా అవాస్తవమని ఖండించారు. జగన్‌రెడ్డి తప్పుడు మాటలు, తప్పుడు పనులు, తప్పుడు కథనాలతో ఎల్లకాలం ప్రజల్ని మోసం చేయలేరని మండిపడ్డారు. తండ్రీకొడుకులిద్దరూ (వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌రెడ్డి) సీమ ప్రజల భావోద్వేగాలను తమ స్వార్థ రాజకీయాలకు వాడుకున్నారే తప్ప, సొంత ప్రాంతానికి చేసిందేమీ లేదని విమర్శించారు. రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం కింద నిర్మిస్తానన్న 23 ప్రాజెక్టుల నిర్మాణంపై పూర్తి వాస్తవాలతో శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము, ధైర్యం జగన్‌రెడ్డికి ఉన్నాయా? అని ప్రశ్నించారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు ఏం చేస్తాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతో ఎంతమంది టికెట్లు మార్చినా, ఎన్ని నియోజకవర్గాల్లో తిరిగినా ప్రజల్లో తనపై ఉన్న అసహ్యం, ఈర్ష్యాద్వేషాలను జగన్‌రెడ్డి చల్లార్చలేడని తేల్చిచెప్పారు. కడప ఎంపీగా షర్మిల, జగన్‌రెడ్డి ఎవరు పోటీ చేసినా గెలిచేది టీడీపీనే అని స్పష్టం చేశారు.

అత్యంత వేడి సంవత్సరంగా 2023

▸▸ 123 ఏళ్ల తర్వాత రెండో వేడి ఏడాదిగా రికార్డు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో 2023లో ప్రపంచవ్యాప్తంగా ఎండలు పెరిగాయి. కరువు, వరదలు, ఇతర విపత్తులు సంభవించాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత 1850 నుంచి 1900 సంవత్సరం మధ్య సగటు కంటే 2023లో 1.4 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా అసాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. ఈ క్రమంలో 1901 తర్వాత 2023వ సంవత్సరం రెండో అత్యంత వేడి ఏడాదిగా నమోదైనట్టు వెల్లడించింది. 1981 నుంచి 2010 వరకు సగటు ఉష్ణోగ్రత కంటే 2023లో 0.65 డిగ్రీలు ఎక్కువ నమోదైంది. దేశంలో 2023లో అన్నిరకాల విపత్తులపైనా ఐఎండీ ప్రాథమికంగా విశ్లేషణ చేసింది. వాతావరణ శాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం 1901 నుంచి ఇప్పటివరకు 2016, 2023, 2009, 2017, 2010 వేడి సంవత్సరాలుగా నమోదయ్యాయి. 1980 నుంచి 2010 వరకు సమోదైన సగటు ఉష్ణోగ్రత కంటే 2016లో 0.71, 2023లో 0.65, 2009లో 0.55, 2017లో 0.54, 2010లో 0.53 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఇంకా 1901 తర్వాత 2023లో ఆగస్టు నుంచి డిసెంబరు వరకు ఐదు నెలలు అత్యంత వేడి నెలలుగా (ఆ నెలల్లో ఉండాల్సిన ఉష్ణోగ్రతల కంటే అధికం), ఫిబ్రవరి రెండో అత్యంత వేడి నెలగా నమోదైంది. గతేడాది దేశంలో అన్ని రకాల విపత్తులతో 2,376 మంది మృత్యువాత పడ్డారు. ఉరుములు, పిడుగుల వల్ల అత్యధికంగా 1,276 మంది, వరదలు, భారీవర్షాలకు 862 మంది, వడగాడ్పులకు 166 మంది, తుఫాన్‌ల తీవ్రతకు 29 మంది, చలి, మంచు ప్రభావానికి 21 మంది, ఇతరత్రా కారణాలతో 22 మంది చనిపోయారు.


ఎఫ్ఆర్ఎస్ నుంచి వైద్యులకు మినహాయింపు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు(ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేస్తోంది. అయితే, ఆరోగ్యశాఖలోని బోధనాసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులకు ఎఫ్ఆర్ఎస్ నుంచి తాజాగా మినహాయింపు ఇచ్చింది. ఈనెల 1 నుంచి అమలు చేస్తున్నట్లు డీఎంఈ సర్క్యులర్ జారీ చేసింది. బోధనాసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లకు ఈ మినహాయింపు ఇచ్చారు. తమకూ మినహాయింపు కల్పించాలని ఇతర ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి సదరమ్ స్లాట్ బుకింగ్ ప్రారంభం

తిరుపతి సిటీ, జనవరి 3: దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీకి గురువారం నుంచి సదరమ్ కేంద్రాల ఎంపిక కోసం స్లాట్ బుకింగులు ప్రారంభం కానున్నాయి. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన స్లాట్ బుకింగ్‌ల ద్వారా సదరమ్ కేంద్రాలను ఎంపిక చేసుకునే వీలుంది. సదరమ్ కేంద్రాల్లో దివ్యాంగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి వైకల్య స్థాయిని నిర్ధారిస్తూ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. దివ్యాంగులు తమకు అనువైన తేదీలను, పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకుని స్లాట్ కేటాయించుకోవచ్చు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, బస్సులు, రైళ్లలో ప్రయాణాలు, సామాజిక పింఛన్లు తదితర సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు సదరమ్ కేంద్రాలు జారీ చేసే ధృవపత్రాలు మాత్రమే ప్రామాణికమవుతాయి. జిల్లాలోని ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో సదరమ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకున్న శారీరక, మానసిక, నేత్ర వైకల్యాలకు సంబంధించిన స్థాయిని నిర్ధారిస్తూ ఈ సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. సదరమ్ కేంద్రాల్లోని నిపుణులైన వైద్యులు అవసరమైన పరీక్షలు జరిపి ధృవపత్రాలు జారీ చేయనున్నారు. స్థానికంగా సచివాలయాలు లేదా మీసేవా కేంద్రాల ద్వారా సదరమ్ స్లాట్‌ను పొందవచ్చు.

డాక్టర్ గురవారెడ్డికి పితృవియోగం



హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ సన్‌షైన్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గురవారెడ్డి తండ్రి అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (90) బుధవారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతిచెందారు. 1933లో తుమ్మల చెరువు, పల్నాడు గ్రామంలో జన్మించిన ఆయనకు రాజ్యలక్ష్మితో వివాహమైంది. కీటకాల శాస్త్రవేత్తగా పేరుగాంచారు. ఆయనకు ముగ్గురు కుమారులు గురవారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నర్సింహారెడ్డి. చదువుకి అంకితంగా తన మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న తండ్రి కోరిక మేరకు ఉస్మానియా ఆస్పత్రికి మా తండ్రి దేహాన్ని ఇస్తున్నట్లు డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. మా నాన్నగారే మా అందరికి ఆదర్శం. అందర్ని తారతమ్యం లేకుండా సమానంగా గౌరవించే మానవత్వాన్ని ఆయన దగ్గరనుంచే నేర్చుకున్నాం.